# ఆహ్వానం – నాల్గవ స్థాయి

**[ తెలుగు ]**

# الدعوة - المستوى الرابع

**لغة التلغو**


అనువాదం : **ముహమ్మద్ కరీముల్లాహ్**

**ترجمة : محمد كريم الله**

పునర్విమర్శ : **షేఖ్ నజీర్ అహ్మద్**

**ترجمة : شيخ نذير احمد**



**రబ్వా జాలియాత్ - రియాద్**

**المكتب التعاوني للدعوة وتوعية الجاليات بالربوة بمدينة الرياض**

# ఆహ్వానం – 4

# Dawah - 4

| వారం | # విషయసూచిక | పేజీ |
|---|---|---|
| 01 | ధర్మప్రచారం మరియు  ధర్మప్రచారకుడు | 2 |
| 02 | ధర్మప్రచారం యొక్క విశిష్ఠత | 4 |
| 03 | ధర్మప్రచారకుల ఉత్తమ లక్షణాలు | 8 |
| 04 | ధర్మప్రచారకుల ఉత్తమ లక్షణాలు | 9 |
| 05 | ధర్మప్రచారకుల అసలు బాధ్యత | 11 |
| 06 | అల్లాహ్ యొక్క ధర్మం వైపునకు ఆహ్వానించటానికి పాటించవలసిన షరతులు | 13 |
| 07 | ప్రస్తుత కాలంలో ఆచరించవలసిన విధానం మరియు అనుసరించవలసిన పద్ధతి | 15 |
| 08 | మాధ్యమిక పరీక్ష | |
| 09 | అల్లాహ్ వైపు ఆహ్వానించటంలో ప్రవక్తల బోధనా పద్ధతి యొక్క ప్రత్యేకతలు | 16 |
| 10 | ధర్మప్రచారకుడి ఇష్టాయిష్టాలు | 18 |
| 11 | ధర్మప్రచారకుడి ఇష్టాయిష్టాలు | 21 |
| 12 | ధర్మప్రచారకుడి ఇష్టాయిష్టాలు | 25 |
| 13 | ధర్మప్రచారకుడి ప్రత్యేక గుణగణాలు | 28 |
| 14 | ధర్మప్రచారకుడి ప్రత్యేక గుణగణాలు | 31 |
| 15 | ధర్మప్రచారకుడి ప్రత్యేక గుణగణాలు | 34 |
| 16 | ఖుత్బ-ఎ-జుమ’హ్ (జుమహ్ ప్రసంగం) | 69 |

| నిమిషాలు 45 | ధర్మప్రచారం - الدعوة<br>ధర్మప్రచారకుడు - الداعية | మొదటి వారం |
|---|---|---|

# దావహ్ - సత్యధర్మప్రచారం

**అద్దావహ్ అంటే ఆహ్వానం:** భాషాపరంగా వ్యాపింపజేయటం, ఇతరుల వరకు చేర్చటం లేక బహిరంగ పరచటం.

**అద్దాఇయహ్ అంటే ఆహ్వానించేవారు:** శుభం (ఖైర్) వైపునకు అంటే ఇస్లాం ధర్మం వైపునకు ఆహ్వానించే బాధ్యతను నెరవేరుస్తున్న వారు.

ఇస్లాంలో అద్దావహ్ అంటే ఇహపరలోకాలలో సాఫల్యం చేకూర్చే ఏకైక సన్మార్గం వైపునకు అంటే అల్లాహ్ వైపు, అల్లాహ్ యొక్క షరిఅహ్ (జీవనవిధానం) వైపు, ఇస్లాం ధర్మం వైపునకు ఆహ్వానించటం.

## ఇస్లామీయ ధర్మ ప్రచారంలో ప్రజల బాధ్యత మరియు ఆవశ్యకత

ప్రజలందరూ విభిన్న దేశాలలో, రంగులలో, సమయాలలో, శక్తులలో మరియు విభిన్న స్వభావాలలో విభజింపబడి ఉన్నప్పటికీ, వారిని ఇస్లామీయ ధర్మం వైపునకు ఆహ్వానించవలసిన ఆవశ్యకత చాలా అధికంగా ఉన్నది. వారి జీవన విధానాన్ని సరైన మార్గదర్శకత్వంలో నడిపే అల్లాహ్

యొక్క ఏకైక సత్య ధర్మం వైపునకు ఆహ్వానించవలసిన మరియు వాస్తవమైన సహజ ధర్మం వైపునకు దారి చూపవలసిన ఆవశ్యత ఎంతో ఉన్నది. వారి యొక్క ప్రస్తుత సంబంధం సృష్టికర్తతో ఉన్నా లేక సృష్టిలోని ఇతర సృష్టితాలతో ఉన్నా సరే.

ఒక సంపూర్ణ, వాస్తవ, సహజ జీవన విధానమే ఇస్లామీయ ధర్మం. కాబట్టి దీనిని స్పష్టంగా, పూర్తిగా అర్థం చేసుకోవలసిన మరియు అనుసరించవలసిన అవసరం ప్రతి మానవుడికీ ఉన్నది. సృష్టి, మానవవుడు మరియు మానవ జీవన విధానం మొదలైన వాటి నిజస్వరూపాన్ని తీర్చుదిద్దుతున్న మరియు స్పష్టం చేస్తున్న దైవిక వాస్తవాలపైనే దీని మూలసిద్ధాంతం ఆధారపడి ఉన్నది. మానవుడికి తను సృష్టింపబడటానికి కారణభూతమైన సృష్టికర్త యొక్క అసలు ఉద్దేశ్యాన్ని తెలియజేస్తున్నది. ఆ మూలాధారాలు మరియు నియమ నిబంధనలే పునాదులుగా మానవజీవితం పై అధికారం చెలాయించే ఇస్లామీయ జీవన విధానం అంటే షరిఅహ్ సృష్టికర్త నుండి మొత్తం మానవజాతి కోసం భూలోకానికి పంపబడినది. కాబట్టి ఇస్లాం అనేది ప్రతి కోణంలోను ఒక సంపూర్ణమైన, మహోన్నత జీవన విధానం మరియు అత్యుత్తమ జీవన నియమావళి.

## <u>అల్లాహ్ వైపు ఆహ్వానించటమే ఆయన యొక్క సందేశహరుల వృత్తి</u>

సృష్టికర్త తనపై మోపిన బాధ్యతలు పూర్తి చేయటానికి వీలుగా ఈ ప్రపంచంలో ప్రతి జీవి ప్రాణం పోయబడి, సృష్టింపబడెను. కాబట్టి, అవి ఈ ప్రపంచ జీవితంలో అల్లాహ్ యొక్క ఉద్దేశ్యాలను మరియు ఇష్టాయిష్టాలను

అనుసరిస్తూ  తమ బాధ్యతలను మరియు వృత్తులను పూర్తి చేయవలసి ఉన్నది. ఈ విశాల విశ్వపు నియమనిబంధనలకు లోబడి తమకు ప్రసాదించబడిన ఆధిక్యతను జాగ్రత్తగా వినియోగించుకోవలసి ఉన్నది. వివిధ ఆహ్వాన పద్ధతుల మరియు విధానాల ద్వారా సామాన్య ప్రజలను అల్లాహ్ వైపునకు పిలవటమనేది, ఆహ్వానించటమనేది నిస్సందేహంగా ప్రవక్తలకు మరియు సందేశహరులకు ఆజ్ఞాపించబడిన ప్రధాన మరియు బహిరంగ వృత్తిధర్మము. ఇంకా ప్రజలకు స్వర్గం గురించి వాగ్దానం చేయమని మరియు నరకం గురించి భయపెట్టమని కూడా వారికి ఆజ్ఞాపించబడినది.

ఎవరినైనా ప్రవక్తగా నియమించటం అంటే ప్రవక్త పదవికి అనుగుణంగా అతని స్వభావాన్ని పూర్తిగా తీర్చిదిద్ది, ఆ తర్వాత అతనికి ప్రవక్త బాధ్యతలను ఇవ్వటం జరుగును. ఇంకో మాటలో చెప్పాలంటే సందేశహరుని యొక్క మహోన్నతమైన బాధ్యతలను తన భుజస్కంధాలపై ఎత్తుకుని, అల్లాహ్ యొక్క దివ్యసందేశాన్ని యదాతథంగా ప్రజలకు అందజేసేటట్లు తయారు చేయటం అన్నమాట. దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు. **“మేము ప్రతి జాతిలోనూ ఒక ప్రవక్తను పంపాము. అతని ద్వారా అందరికీ ఇలా హెచ్చరిక చేసాము – అల్లాహ్ నే ఆరాధించండి, మిథ్యాదైవాల ఆరాధనకు దూరంగా ఉండండి”** సూరహ్ నహల్ 16:36.
మరియు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గురించి దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు - **“ఓ ప్రవక్తా  మేము నిన్ను సాక్షిగా చేసి, శుభవార్తను తెలిపే వానిగా చేసి, హెచ్చరిక చేసేవానిగా చేసి, అల్లాహ్**

**వైపునకు పిలిచేవానిగా చేసి, ప్రకాశించే దీపంగా చేసి పంపాము."** సూరహ్ అల్ అహజాబ్ 33:45

| 45 నిమిషాలు | ధర్మప్రచారం యొక్క విశిష్ఠత | 2వ వారం |
|---|---|---|

**ఆహ్వానం (అద్దావహ్) యొక్క విశిష్ఠత**

- అల్లాహ్ వైపునకు ఆహ్వానించటమనేది ఒక ఉన్నతమైన మరియు ఉత్తమమైన వృత్తి. ఎందుకంటే ఇది ప్రవక్తలందరి వృత్తి ధర్మమై ఉండినది. నిస్సందేహంగా అల్లాహ్ కు అతి చేరువలో ఉండేవారిలో మొదటి స్థానం ప్రవక్తలది. వారు అల్లాహ్ ఇష్టపడినవారు, గౌరవమర్యాదలకు కొలమానం(తూకం) వంటివారు. సృష్టంతటిలో ఉత్తమమైన వారు మరియు సత్యశీలురు. ఆ వృత్తిధర్మాన్నే ప్రవక్తల, సందేశహరుల తర్వాత ప్రజలకు మార్గదర్శకత్వం వహించిన ఖలీఫాలనబడే వారి సహచరులు అనుసరించారు.

అక్కడితో ఆగక, ఆ పరంపరను తర్వాత కాలాలలోని ధర్మపండితులు కొనసాగిస్తూ ప్రజలను సత్యమార్గం వైపునకు ఆహ్వానించటం జరుగుతున్నది. వారు అనేక శుభాలతో నిండిన ఇస్లాం ధర్మాన్ని ప్రజలకు అర్థమయ్యే విధంగా, ఇష్టపడే విధంగా వివరిస్తూ, సర్వలోక సృష్టకర్త స్వీకరించే ఏకైక సత్యమార్గం వైపునకు

ఆహ్వానిస్తున్నారు. అంతేకాక వారిని అజ్ఞానపు గాఢాంధకారం నుండి బయటకు తీసి, ధర్మ జ్ఞానపు మరియు సరైన దైవవిశ్వాసపు వెలుగు కిరణాల వైపునకు దారి చూపుతున్నారు. దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు – **“అల్లాహ్ వైపునకు పిలిచి మంచి పనులు చేసి, నేను ముస్లింను అని ప్రకటించే వ్యక్తి మాటకంటే మంచి మాట మరెవరిది కాగలదు?”** 41:33

- ఈ ధర్మప్రచార మార్గంలో ముఖ్యమైనది చిత్తశుద్ధితో కూడిన దైవవిధేయత మరియు ఏకైక ఆరాధ్యుడి వద్దకు మాత్రమే చేర్చే అసలైన సత్యమార్గపు ఎన్నిక. ప్రజలను అసలైన సత్యమార్గాన్ని అనుసరించేటట్లు చేయటమే ఈ కృషి యొక్క అసలు ఉద్దేశ్యం గనుక ఆహ్వానించేవారు కూడా సర్వలోక సృష్టికర్తకు చేర్చే ఏకైక సత్యమార్గాన్ని అర్థం చేసుకుని ఉండవలెను. ప్రజలు ఇహపరలోక సాఫల్యం పొందటమే ధర్మప్రచారకుల ముఖ్యలక్ష్యంగా ఉండవలెను.

అబూ హురైరా రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒకసారి ఇలా ఉపదేశించినారు – ఎవరైతే సత్యమార్గం వైపునకు పిలుస్తారో, వారికి పుణ్యాలు మరియు శుభాలు లభించును. మంచి దారి వైపునకు మళ్ళిన ఆ మొత్తం వ్యక్తులకు లభించే పుణ్యాలు మరియు శుభాలకు సరిసమానంగా వారిని ఆ సన్మార్గం వైపునకు పిలిచిన వారికీ లభించును. ఆహ్వానించిన వారి పుణ్యాలు మరియు ఆచరిస్తున్న

వారి పుణ్యాలలో ఎటువంటి తగ్గింపులూ ఉండవు. ముస్లిం హదీథ్ గ్రంథం.

- ఎవరైతే మంచి వైపునకు ఆహ్వానించే మరియు చెడు నుండి ఆపటానికి ప్రయత్నించే బాధ్యతను నెరవేరుస్తున్నారో, వారి తరుఫున అల్లాహ్ ఉంటాడు.

**"వారు మాటిమాటికీ తమ తమ పాపాలకు ప్రాయశ్చిత పడేవారు, ఆయనను ఆరాధించేవారూ, ఆయనను స్తుతించేవారూ, ఆయన కొరకు భూమి మీద సంచారం చేసేవారూ, ఆయన సన్నిధిలో రుకూలూ, సజ్దాలు (సాష్టాంగం) చేసేవారూ, మంచిని చెయ్యండి అని ఆజ్ఞాపించేవారూ, చెడును చేయవద్దని నిరోధించేవారూ, అల్లాహ్ విధించిన హద్దులను కాపాడేవారూ. ప్రవక్తా! ఇటువంటి విశ్వాసులకు శుభవార్తను అందజెయ్యి."** సూరహ్ అత్తౌబహ్ 112.

ఇస్లామీయ పండితుల అభిప్రాయం ప్రకారం ఈ పవిత్ర వచనం ధర్మం వైపునకు ఆహ్వానించే అవకాశం, శక్తి, సామర్థ్యాల గురించి సాక్ష్యమిస్తూ, ఎవరికైతే అల్లాహ్ వీటిని ప్రసాదించాడో వారు తప్పక ధర్మప్రచారం

చేయాలని ఆదేశిస్తున్నది. కాబట్టి ఎవరికైతే అల్లాహ్ ఈ ప్రపంచంలో శక్తిసామర్థ్యాలు, అవకాశాలు ప్రసాదించాడో వారు తప్పక మనసా వాచా కర్మా మంచి పనులను ప్రోత్సాహిస్తూ మరియు చెడు పనులను నిరోధిస్తూ ఉండవలెను. (చెడును ముందుగా తన చేతులతో తుడిచి

వేయటానికి ప్రయత్నించవలెను, అలా చేయలేని పక్షంలో నోటి మాటలతో దానిని ఖండిస్తూ, దానిలోని చెడును బహిరంగపరచవలెను.

ఒకవేళ అలా చేయటం కూడా సాధ్యం కాని పక్షంలో, కనీసం మనసులోనైనా ఆ పనిని చెడుగా భావించవలెను.) అలా చేయకపోతే అతను కూడా పాపత్ముడిగా లెక్కించబడును మరియు తీర్పుదినమున దానికి సమాధానమివ్వవలసి ఉంటుంది. ఈ విషయమై అల్లాహ్ దివ్యఖుర్ఆన్ లో ఇలా ప్రకటిస్తున్నాడు – **విశ్వాసులైన పురుషులూ, విశ్వాసులైన స్త్రీలూ ఒకరికొకరు సహచరులు. వారు మేలు చెయ్యండి అని ఆజ్ఞాపిస్తారు. చెడు చెయ్యవద్దు అని నిరోధిస్తారు. నమాజు స్థాపిస్తారు. జకాహ్ ఇస్తారు. అల్లాహ్ పట్ల ఆయన ప్రవక్త పట్ల విధేయత చూపుతారు. వారి మీదనే అల్లాహ్ తన కారుణ్యాన్ని తప్పకుండా అవతరింపజేస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ అందరి కంటే ప్రబలుడూ, వివేకవంతుడూ, వివేచనాపరుడూను.** అత్తౌబహ్ 71.

- అల్లాహ్ కపటులను తీవ్రంగా హెచ్చరించెను. వారి స్వభావం విశ్వాసుల స్వభావానికి బద్ధవిరుద్ధంగా ఉంటుందని తెలియజేసెను. అల్లాహ్ ఈ విషయాన్ని దివ్యఖుర్ఆన్ లో ఇలా ప్రకటించెను.
- **కపటులైన పురుషులూ, కపటులైన స్త్రీలూ అందరూ ఒకే కోవకు చెందిన వారు. వారు చెడు చెయ్యండి అని ఆజ్ఞాపిస్తారు. మంచిని చెయ్య వద్దు అని నివారిస్తారు**. సూరహ్ అత్తౌబా 9:67

- సత్యధర్మం వైపునకు ఆహ్వానించే బాధ్యతను నెరవేర్చటంలో, మంచిని ప్రోత్సహించటంలో మరియు చెడును నిరోధించటంలోనే

సాఫల్యం ఉన్నది. ఈ యొక్క ముఖ్యమైన బాధ్యత నెరవేర్చటం వలన ప్రాప్తమయ్యే సాఫల్యం గురించి, దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు – **వారు తమకు జ్ఞాపకం చెయ్యబడిన హితబోధనలను పూర్తిగా విస్మరించినప్పుడు, మేము చెడు నుండి ప్రజలను వారించేవారిని రక్షించాము. దుర్మార్గులైన ఇతరులందరినీ వారి అవిధేయతల కారణంగా కఠినశిక్షకు గురిచేశాము**. – సూరహ్ అల్ అరాఫ్ 165.

- కాబట్టి, ఇక్కడ చెడు నుండి నిరోధించటం వలన వారు సాఫల్యం పొందారని అల్లాహ్ స్పష్టంగా ప్రకటిస్తున్నాడు. అన్నోమాన్ బిన్ బషీర్ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒకసారి ఇలా ఉపదేశించినారు – అల్లాహ్ ఆదేశించిన హద్దులనే దృఢంగా పట్టుకుని, స్థిరంగా దైవమార్గంలో జీవిస్తూ, ఇతరులను కూడా చెడు నుండి నిరోధిస్తున్నవారి ఉపమానం ఇలా ఉన్నది - కొంతమంది ప్రజలు ఒక ప్రజలు పడవలో ప్రయాణం చేస్తున్నారు. కొందరికి
- పడవలోని పై అంతస్థులో మరియు మిగిలిన వారికి క్రింది అంతస్థులో స్థానం లభించినది. అయితే, క్రింద ఉన్నవారు తమకు అవసరమైనప్పుడల్లా, పై అంతస్థుకు పోయి నీరు తెచ్చుకోవలసి ఉండినది. అలా కొంత దూరం ప్రయాణం సాగినది. అయితే, మాటిమాటికీ నీటి కోసం పై అంతస్థు వారిని ఇబ్బంది పెట్టే బదులు, తమ అంతస్థు నుండే పడవకు రంధ్రం చేసి నీరు తీసుకోవచ్చు కదా అనే ఒక అవివేకపు ఆలోచన క్రింది అంతస్థువారికి వచ్చినది. (అంటే

తమ అంతస్థులోని పడవ గోడకు రంధ్రం వేసి, బయటి నీటిని తిన్నగా లోనికి రానివ్వటం ద్వారా మాటిమాటికీ పైకి పోయే ఇబ్బంది తొలిగి పోతుందని వారు భావించారు). దానిని అమలు చేయనిస్తే, అంటే క్రింది అంతస్థులోని వారిని పడవకు రంధ్రం చేయనిస్తే, మొత్తం పడవే మునిగి పోతుంది మరియు పడవలోని వారందరూ మునిగిపోతారు కదా. అలాకాకుండా, పై అంతస్థువారు గనుక క్రింది అంతస్థువారిని పడవకు రంధ్రం వేయకుండా నిరోధించినట్లయితే, ప్రయాణికులందరూ రక్షింపబడతారు. సహీహ్ బుఖారీ హదీథ్ గ్రంథం.

ఇంకో హదీథ్ లో అబ్దుల్లాహ్ ఇబ్నె మస్ఊద్ రదియల్లాహు అన్హు ఉల్లేఖన ప్రకారం, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒకసారి ఇలా ఉపదేశించినారు - నిస్సందేహంగా బనీ

ఇస్రాయీలు జాతి పై అవతరింపజేయబడిన తొలి శిక్ష ఇలా ఉన్నది – ఒకవేళ ఒక వ్యక్తి, చెడుపనులలో మరియు పాపకార్యాలలో మునిగి ఉన్న ఇతర వ్యక్తికి ఎదురు పడినట్లయితే, మొదటి వ్యక్తి అతనితో ఇలా పలికే వాడు – 'ఓ ఫలానా మానవుడా! అల్లాహ్ కు భయపడు. నీవు ఏదైతే చెడు పని చేస్తున్నావో, దానిని వదిలి వేయుము. ఆ పని నీ కోసం ధర్మబద్ధమైనది (హలాల్) కాదు.' మొదటి వ్యక్తి రెండో రోజున మరల అతనితో కలిసేవాడు. ఈసారి అతడిని ఆ చెడు పని నుండి నిరోధించక, తను కూడా దానిలో చేరిపోయేవాడు. దీనికి కారణం చెడు సహవాసానికి

అలవాటు పడిపోవటం. ఎప్పుడైతే మొదటి వ్యక్తి అలా చేసేవాడో, అల్లాహ్ వారిద్దరి మనస్సులపై ముద్ర వేసేసేవాడు.

అలా పలికి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం దివ్యఖుర్ఆన్ లోని ఈ వచనాన్ని పఠించేవారు (అనువాదం) – **బనీ ఇస్రాయీలు జాతి ప్రజలను ప్రవక్త దావూద్ అలైహిస్సలాం మరియు ప్రవక్త ఈసా అలైహిస్సలాం లు శపించి ఉన్నారు. ఎందుకంటే వారు అవిధేయత చూపేవారు. హద్దుమీరి ప్రవర్తించేవారు. తాము చేస్తున్న చెడుపనుల నుండి పరస్పరం నిరోధించుకునేవారు కాదు. ఆ చెడు పనులు చాలా నీచమైనవి. వీరిలో చాలా మంది అవిశ్వాసులతో స్నేహం చేయటం మీరు చూస్తారు. వారు తమ పరలోక జీవితం కోసం జమచేస్తున్న ప్రతిఫలం చాలా అశుభమైనది. (వారి ఖాతాలో వారు చేస్తున్న ప్రతి చెడు పని, పాపపు పని వ్రాయబడుతున్నది అంటే**

**తమ పాపాన్ని వారు పెంచుకుంటున్నారు). దీని కారణంగా అల్లాహ్ వీరిని అయిష్ట పడుతున్నాడు. వారు ఎల్లప్పుడూ కఠిన శిక్ష పొందుతూ ఉంటారు. ఒకవేళ వారికి అల్లాహ్ పై, ఆయన యొక్క ప్రవక్తలపై మరియు ఆయన అవతరింపజేసిన దివ్యగ్రంథాలపై విశ్వాసం గనుక ఉండినట్లయితే, వారు అవిశ్వాసులతో స్నేహం చేసి ఉండేవారు కాదు. కాని వీరిలో దుష్టులు చాలా మంది ఉన్నారు.** సూరహ్ అల్ మాయిదాహ్ 78 – 81.

ఆ తర్వాత ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు – ఖబడ్దార్ (జాగ్రత)! అల్లాహ్ పై శపథం చేస్తున్నాను. మీరు ప్రజలను

మంచి పనులు మరియు పుణ్యకార్యాలు చేయమని తప్పక ఆదేశిస్తూ ఉండవలెను. ఇంకా మీరు ప్రజలను చెడు పనులు మరియు పాపపు కార్యాలు చేయకుండా తప్పక నిరోధిస్తూ ఉండవలెను. దౌర్జన్యపరుని చెయ్యిని తప్పకుండా ఆపుతూ ఉండవలెను. మరియు ఆ దౌర్జన్యపరుడిని తప్పకుండా ధర్మం వైపునకు ఆహ్వానిస్తూ ఉండవలెను ఒకవేళ మీరు అలా చేయక పోతున్నట్లయితే, అల్లాహ్ మీ మనస్సుల పై ముద్ర వేయును. మరియు బనీ ఇస్రాయీల్ ప్రజలపై అవతరింపజేసిన శాపం వంటి శాపమే మీ పై కూడా అవతరింప జేయును. అబూ దావూద్ మరియు అత్తిర్మిథీ హదీథ్ గ్రంథాలు.

| 45 నిమిషాలు | ధర్మప్రచారకుల ఔన్నత్యం | 3వ వారం |
|---|---|---|

## సత్యధర్మప్రచారకుల ఔన్నత్యం

ఖుర్ఆన్ మరియు సున్నహ్ లలో దుఆత్ లకు (సత్యధర్మప్రచారకులకు) ఉండవలసిన ఉత్తమ గుణగణాల గురించి మరియు పరలోకంలో వారికి లభించబోయే ప్రతిఫలాల గురించి అన్వేషించినట్లయితే, లెక్కలేనన్ని సూచనలు మనకు కనబడును. ఉదాహరణకు –

1) **మానవులలో ఉత్తములు** – అల్లాహ్ వైపు ఆహ్వానించేవారే ప్రజలందరిలో ఉత్తములు మరియ పుణ్యులు. వారి గురించి దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు – **ఇక నుండి ప్రపంచంలో మానవులకు మార్గదర్శకత్వం చేయటానికి, వారి**

**సంస్కరణలకు రంగంలోనికి తీసుకు రాబడిన ఉత్తమ సమాజం మీరే. మీరు మంచిని చెయ్యండి అని ఆజ్ఞాపిస్తారు. చెడు నుండి ఆపుతారు. అల్లాహ్ ను విశ్వసిస్తారు.** సూరహ్ ఆలే ఇమ్రాన్ 110.

2) **మానవజాతి పై సాక్షిమాత్రులు, ధృవపరచేవారు** – అల్లాహ్ వైపు పిలిచేవారే ప్రజలపై సాక్ష్యమిచ్చేవారు మరియు ధృవపరచేవారు. దీని గురించి ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు – **ఈ విధంగా మేము మిమ్ములను ఒక ఉన్నతమైన సభ్య సమాజంగా చేశాము. ఇకపై మీరు సమస్త మానవజాతికి సాక్షులుగా ఉంటారు. ప్రవక్త మీకు సాక్షిగా ఉంటాడు.**
(సూరహ్ అల్ బఖరహ్ 143)

3) **ఇహపరలోకాలలో సాఫల్యం పొందేవారు** – అల్లాహ్ వైపు ఆహ్వానించేవారు ఇహపరలోకాలలో సాఫల్యం మరియు విజయం పొందుతారు. దీని గురించి ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు – **మీలో మంచి వైపునకు పిలిచేవారూ, మేలు చెయ్యండి అని ఆజ్ఞాపించేవారూ, చెడు నుండి వారించే వారూ కొందరు తప్పక ఉండవలెను. అటువంటి వారే సాఫల్యం పొందుతారు.** ఆలే ఇమ్రాన్ 104.

4) **ఉత్తమ సంభాషకులు** – అల్లాహ్ వైపు పిలిచే వారే మాటలలో, పలుకులలో మరియు సంభాషణలలో అందరి కంటే ఉత్తములు. దీని గురించి ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు – **అల్లాహ్ వైపునకు, పిలిచి మంచి పనులు చేసి, నేను ముస్లింను**

**అని ప్రకటించే వ్యక్తి మాట కంటే మంచి మాట మరెవరిది కాగలదు.** సూరహ్ ఫుస్సిలత్ 33

| 45 నిమిషాలు | **ధర్మప్రచారకుల ఔన్నత్యం** | 4వ వారం |
|---|---|---|

5) **దైవప్రవక్తల వారసులు** – అల్లాహ్ వైపు పిలిచేవారు (అంటే ఖుర్ఆన్ మరియు సున్నహ్ లను బోధించేవారు, మంచి పనులను ప్రోత్సహించేవారు మరియు చెడు పనులను నిరోధించేవారు) దైవప్రవక్తల అసలైన వారసులు. దీనికి ఆధారం సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం, అత్తిర్మిధీ, అన్నిసాయి మరియు అబూ దావూద్ హదీథ్ గ్రంథాలలో మరియు ఇమాం హాకిమ్ రహిమహుల్లాహ్ నమోదు చేసిన ఈ హదీథ్ – **العلماء** ورثة الأنبياء అనువాదం – **పండితులు (అల్ ఉలేమా) ప్రవక్తల వారసులు**.

ఇక్కడ పండితులు (అల్ ఉలమా) అంటే అల్లాహ్ వైపు పిలిచే పండితులు మరియు ఆహ్వానించేవారు అని అర్థం. వారు మానవులందరినీ మరియు సమాజములన్నింటినీ అల్లాహ్ యొక్క సత్యధర్మం వైపునకు ఆహ్వానించటంలో మరియు వారికి సరైన మార్గం చూపించటంలో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధించిన విధానాన్ని మనస్పూర్తిగా సంపూర్ణ విధేయతతో, చిత్తశుద్ధితో ఆచరిస్తారు.

6) **ప్రార్థనలు పొందేవారు** – అల్లాహ్ వైపు ఆహ్వానించేవారి ప్రాయశ్చితం మరియు క్షమాపణ కోసం భూమ్యాకాశాలలో ఉన్నవన్నీ ప్రార్థిస్తుంటాయి. దీనికి ఆధారం ఆబూ అమామహ్ అల్ బహ్లీ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన అత్తిర్మిథీ హదీథ్ గ్రంథంలోని ఈ హదీథ్ –

**"ان الله و ملائكته و اهل السماوات و الأرض حتى النملة في جحره و الحيتان في البحر يصلون على معلم الناس الخير" ترمذى**

**అనువాదం** - "నిశ్చయంగా, ప్రజలకు మంచిని బోధించేవారి కోసం అల్లాహ్ మరియు అల్లాహ్ యొక్క దైవదూతలు, భూమ్యాకాశాలలోని సృష్టి మొత్తం - అవి తమ గుట్టలో ఉండే చీమలైనా మరియు సముద్రం లోపల ఉండే చేపలైనా సరే దుఆ చేస్తూ ఉండును (ప్రార్థిస్తూ ఉండును)."

అంటే తన వైపు ఆహ్వానించే దాసుల పై అల్లాహ్ సలాహ్ (దుఆ – ప్రార్థనలు) పంపటం అంటే వారిపై తన కారుణ్యాన్ని కురిపించటం మరియు దైవదూతల ద్వారా వారి కోసం దుఆ (ప్రార్థన) చేయించటం అంటే దైవదూతలు వారి ప్రాయశ్చితం, క్షమాపణ, ముక్తి మరియు మోక్షం కోరటం, ఇంకా ఇతర దాసుల మరియు జీవుల ద్వారా దుఆ చేయించటం అంటే ఇతర సృష్టిచరాలు వారి శుభాన్ని కోరటం అని భావించబడుతున్నది.

7) **పుణ్యాలు ఎన్నటికీ తరగవు** – అల్లాహ్ వైపు ఆహ్వానించేవారి మంచి పనులు, పుణ్యకార్యాలు, శుభాలు ఎన్నటికీ తరగవు అంటే తగ్గిపోవు. దీనికి ఆధారం సహీహ్ ముస్లిం హదీథ్ గ్రంథంలో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వలస్లం ఉపదేశించిన ఈ హదీథ్ –

**مَنْ دَعَا إِلَى هُداً كَانَ لَهُ مِنْ الأَجْرِ مِثْلُ أُجُوْرِ مِنْ تَبِعَهُ لاَ يَنْقُصُ ذَلِكَ مِنْ أُجُوْرِهِمْ شَيْئاً - مسلم**

**అనువాదం** - ఎవరైతే సత్యమార్గం వైపునకు పిలుస్తారో, వారికి పుణ్యాలు మరియు శుభాలు లభించును. మంచి దారి వైపునకు మళ్ళిన ఆ మొత్తం వ్యక్తులకు లభించే పుణ్యాలు మరియు శుభాలకు సరిసమానంగా వారిని ఆ సన్మార్గం వైపునకు పిలిచిన వారికీ లభించును. ఆహ్వానించిన వారి పుణ్యాలు మరియు ఆచరిస్తున్న వారి పుణ్యాలలో ఎటువంటి తగ్గింపులూ ఉండవు.

8) **అత్యుత్తమ శుభకార్యం** –ప్రజలు తమ పిలుపును అనుసరించి అల్లాహ్ వైపునకు మరలటమనేది ఆహ్వానకుల భూలోక శుభకార్యాలన్నింటిలోనూ అత్యుత్తమమైన మరియు అత్యున్నతమైన శుభకార్యం దీనికి ఆధారం అలీ బిన్ అబీ తాలిబ్ రదియల్లాహు అన్హు ఉల్లేఖన ద్వారా సహీహ్ బుఖారీ హదీథ్ గ్రంథంలో నమోదు చేయబడిన ఈ హదీథ్ –

**అనువాదం** – అలీ బిన్ అబీ తాలిబ్ రదియల్లాహు ఉల్లేఖన ప్రకారం ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒకసారి ఇలా

ఉపదేశించినారు - అల్లాహ్ పై ప్రమాణం! అల్లాహ్ ఒకవేళ మీ ద్వారా ఏ ఒక్కరికైనా మార్గదర్శకత్వాన్ని ప్రసాదించినట్లయితే, మీకోసం అది మేలుజాతి ఒంటెలను కలిగి ఉండటం కంటే ఎంతో ఉత్తమమైనది. (ఆ కాలంలో మేలు జాతి ఒంటెలను కలిగి ఉండటమనేది అత్యుత్తమమైన ఐశ్వర్యానికి చిహ్నంగా భావించబడేది.)

ఇంకో ఉల్లేఖనలో ఇలా ఉన్నది – మీ కోసం అటువంటి వస్తువుల కంటే ఉత్తమమైనది వేటిపైనైతే సూర్యుడు ఉదయించునో మరియు అస్తమించునో.

అల్లాహ్ వైపు ఆహ్వానించేవారి యొక్క ఈ ప్రాధాన్యత ఎవరైనా మనస్ఫూర్తిగా ఇస్లాం ధర్మం స్వీకరించటానికి కారణమవటం ద్వారా బహిర్గతమౌతుంది. మరి ఎవరి ద్వారా నైనా ఒక జాతి మొత్తం లేదా ఒక సమాజం మొత్తం ఇస్లాం ధర్మాన్ని స్వీకరించినట్లయితే, అటువంటి వారి ప్రాధాన్యత ఎంత ఉన్నత స్థాయికి చేరిపోతుందో ఊహించగలమా

| 45 నిమిషాలు | **ధర్మప్రచారకుల అసలు బాధ్యతలు** | 5 వ వారం |
|---|---|---|

ప్రజల హృదయాలను సరైన మార్గదర్శకత్వం వైపునకు మళ్ళించే శక్తి ప్రవక్తల చేతిలో గాని లేదా వేరే ఇతర మానవుల చేతిలో గాని లేదు. అలాగే, మానవుల హృదయాలలో తన ఇష్టాయిష్టాలను, దుష్టాలోచనలను, అవిశ్వాసాన్ని నాటి, మానవులను తప్పుడు దారిలోనికి మళ్ళించే శక్తి షైతానుకు కూడా లేదు. వీరిద్దరూ అంటే అల్లాహ్ అనుగ్రహాన్ని పొందే మార్గం వైపు ఆహ్వానించేవారు మరియు అల్లాహ్ ఆగ్రహాన్ని పొందే మార్గం వైపు ఆహ్వానించేవారు కేవలం తమ తమ మార్గాల వైపునకు పిలవటం మాత్రమే చేయగలరు. కాని సత్యమార్గదర్శకత్వాన్ని లేదా అసత్యమార్గదర్శకత్వాన్ని గ్రహించటం మరియు స్వీకరించటం అనేది కేవలం మానవుడి స్వంత నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ఇంకా అతని స్వభావం పై మరియు అల్లాహ్ యొక్క ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుంది.

అల్లాహ్ వైపు ఆహ్వానించేవారి బాధ్యతలలో ముఖ్యమైనది – ప్రజలకు సత్యమార్గం గురించి మరియు ఏకదైవత్వం గురించి స్పష్టమైన నిదర్శనాలతో వివరించటం మరియు హెచ్చరించటం. అయితే వారు ఏ దారిలో మరలుతారనేది కేవలం అల్లాహ్ యొక్క నిర్ణయం పై ఆధారపడి ఉంటుంది. ఈ విషయం గురించి దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు –

- **అల్లాహ్ కు విధేయులు కండి. దైవ ప్రవక్త ఆదేశాలను పాటించండి. కాని ఒకవేళ మీరు విముఖులైతే, బాగా తెలుసుకోండి, దైవప్రవక్త పై మోపబడిన కర్తవ్యభారం వరకే ఆయన బాధ్యుడు. మీ పై మోపబడిన కర్తవ్యభారానికి మీరు బాధ్యులు. దైవ ప్రవక్తకు విధేయులైతే మీరే మార్గదర్శకత్వం పొందుతారు. లేకపోతే స్పష్టంగా ఆజ్ఞను అందజెయ్యటాన్ని మించి ఎక్కువ బాధ్యత దైవప్రవక్త పై లేదు. అన్నూర్ 24:54**

- **ప్రవక్తా! నీకు ఇష్టమైన వారికి నీవు మార్గదర్శకత్వాన్ని (హిదాయత్) ప్రసాదించలేవు. కాని అల్లాహ్ తనకు ఇష్టమైన వారికి మార్గదర్శకత్వాన్ని ప్రసాదించగలడు, ఆయన తన మార్గదర్శకత్వాన్ని స్వీకరించేవారిని బాగా ఎరుగును. సూరహ్ అల్ ఖసస్ 28:56**

- **ప్రవక్తా! వారికి సన్మార్గం లభించాలని నీవు ఎంతగా కోరుకున్నా అల్లాహ్ తాను అపమార్గం పట్టించే వానికి మళ్ళీ సన్మార్గం చూపడు. అటువంటి వారికి ఎవ్వరూ సహాయపడలేరు. అస్ నహల్ 16:37**

- **కానీ నీవు ఎంతగా కోరినా వీరిలో చాలా మంది విశ్వసించలేరు. వాస్తవానికి నీవు ఈ సేవకు వీరి నుండి ఎటువంటి ప్రతిఫలం కూడా కోరటం లేదు. ప్రపంచంలో ప్రజలందరికీ ఇది ఒక హితబోధ.** యూసుఫ్ 12:103

ప్రజలు తమ మాట వింటున్నారా లేక నిర్లక్ష్యం చేస్తున్నారా అనే విషయం గురించి సత్యధర్మప్రచారకులు ఆలోచించవలసిన అవసరం లేదు. పరిసర వాతావరణం మరియు ప్రపంచ పరిస్థితులు వారి ధర్మప్రచారానికి

అనుగుణంగా ఉన్నాయా లేక వ్యతిరేకంగా ఉన్నాయా అనేది కూడా వారు ఆలోచించవలసిన అవసరం లేదు. అయితే ఎటువంటి పరిస్థితులలోనైనా సరే సమాజాన్ని వినాశనానికి దారి చూపే దుష్టత్వంతో నిండిన అసత్యమార్గం నుండి ఇహపరలోక సాఫల్యాలతో కూడిన స్వచ్ఛమైన సత్యమార్గం వైపునకు ఆహ్వానించటానికి అవసరమయ్యే జ్ఞానాన్ని, సామర్థ్యాన్ని, నైపుణ్యాన్ని, మనోధైర్యాన్ని, చాకచక్యాన్ని సమకూర్చుకోవటానికి ప్రయత్నించటం మంచిది.

ఈ విషయం గురించి దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు – **వారిలోని ఒక వర్గం ప్రజలు మరొక వర్గం వారితో ఇలా అన్నారు : "మీరు హితబోధ ఎందుకు చేస్తున్నారు అల్లాహ్ నాశనం చేయనున్నవారికి, కఠినంగా శిక్షించనున్నవారికి ?" వారు ఇలా సమాధానం చెప్పారు :"మేము మీ రబ్ (ప్రభువు) ముందు క్షమింపబడటానికి ఒక కారణంగా చెప్పుకునే నిమిత్తం ఇదంతా చేస్తున్నాము. బహుశా ఈ ప్రజలు ఆయన పట్ల అవిధేయతను వదిలి వేస్తారనే కు ఆశతో చేస్తున్నాము." చివరకు వారు (దుష్టులు) తమకు జ్ఞాపకం చేయబడిన హితబోధలను పూర్తిగా విస్మరించినప్పుడు, మేము చెడు నుండి ప్రజలను వారించే వారిని (ధర్మప్రచారకులను) రక్షించాము. దుర్మార్గులైన ఇతరులందరినీ వారి అవిధేయతలు కారణంగా కఠినశిక్షకు గురిచేశాము.** సూరహ్ అల్ అరాఫ్ 7:164

నిశ్చయంగా సహాయసహకారాల కేవలం అల్లాహ్ నుండే లభిస్తాయనే వాస్తవం పై పూర్తిగా నమ్మకం ఉంచవలెను. అల్లాహ్ యొక్క మార్గదర్శకత్వం పై విశ్వాసం ఉంచవలెను. ఇటువంటి అచంచల విశ్వాసం

అధిక మోతాదులో ప్రతి ధర్మప్రచారకుడిలో తప్పకుండా ఉండవలెను. ఇది ధర్మప్రచారకుడిలో మనోధైర్యాన్ని, బలాన్ని చేకూర్చును మరియు అతని కళ్ళలోనుండి రాలే అశువులను తుడిచివేయును. ధర్మప్రచార విరోధులు మరియు అరాచకాన్ని వ్యాపించజేసే దుష్టశక్తులు అతని దారిలో అనేక ఆటంకాలను, అవరోధాలను కలుగజేస్తారు.

అవి ఎంత తీవ్రంగా ఉంటాయంటే, ఒక్కోసారి ధర్మప్రచారకులు ఇక అల్లాహ్ వైపు ప్రజలను ఆహ్వానించటం వారి వల్ల అయ్యే పని కాదని, అడుగడుగునా ఎదుర్కొంటున్న వ్యతికరేక పరిస్థితులలో ధర్మప్రచారం అసాధ్యమైపోతున్నదని, తమలోని శక్తిసామర్థ్యాలు ధర్మప్రచారాన్ని ముందుకు తీసుకు పోవటానికి సరిపోవటం లేదని అనుకోవటం మొదలుపెడతారు.

అయితే ఇటువంటి క్లిష్టపరిస్థితులలో అల్లాహ్ యొక్క సహాయసహకారాలు వారికి తప్పక లభిస్తాయనే ఆత్మస్థైర్యం, దృఢమైన విశ్వాసం వారిలో కలగవలెను. దానితో వారు ఎన్ని అవాంతరాలు, అడ్డంకులు ఎదురైనా సరే, వ్యాపిస్తున్న తమ ధర్మప్రచారాన్ని ఎట్టి

పరిస్థితులలోను ముందుకు తీసుకుపోవలసినదేనని గట్టిగా నిర్ణయించుకుంటారు. అలా స్వయంగా ఇష్టపడి, ఐచ్ఛికంగా కేవలం తన అంగీకారం కోసం, తన సహాయసహకారాలపైనే ఆధారపడి ధర్మప్రచారాన్ని కొనసాగించే పట్టుదల అల్లాహ్ ఎంతో సంతోషాన్ని కలుగజేస్తుంది.

అటువంటి వారి గురించి అల్లాహ్ దివ్యఖుర్ఆన్ లో ఇలా ప్రకటిస్తున్నాడు – **మన జీవన విధానంలో అల్లాహ్ మనకు మార్గదర్శకత్వం**

**వహించినప్పుడు మనం అల్లాహ్ ను ఎందుకు నమ్ముకోకూడదు? మమమీరు మమ్మల్ని పెడుతున్న బాధలు ఓర్పుతో సహిస్తాము. నమ్ముకునే వారు కేవలం అల్లాహ్ ను మాత్రమే నమ్ముకోవాలి** –ఇబ్రాహీం 14:12

| 45 నిమిషాలు | సత్యధర్మ ప్రచారంలో పాటించవలసిన షరతులు | 6వ వారం |
|---|---|---|

1. మనం ఆహ్వానిస్తున్న సత్యధర్మం పై మనకు దృఢమైన అచంచల విశ్వాసం ఉండవలెను. ఆ మార్గదర్శకత్వాన్ని చిత్తశుద్ధితో, మనస్ఫూర్తిగా నమ్మిన వారై ఉండవలెను. **ప్రవక్త తనపై తన ప్రభువు నుండి అవతరించిన దానిని విశ్వసించినాడు. ఈ ప్రవక్తను విశ్వసించేవారు కూడా దానిని హృదయపూర్వకంగా విశ్వసించినారు.** – సూరహ్ అల్ బఖరహ్ 2:285

2. ఏ ధర్మాన్నైతే మనస్ఫూర్తిగా స్వీకరించినాడో, దానిని నోటిపలుకుల ద్వారా కూడా ధృవీకరించవలెను. **గ్రంథోపదేశాలను ప్రజలలో వ్యాపింపజేయాలని, వాటిని మరుగు పరచరాదని అల్లాహ్ వారితో చేయించిన ప్రమాణాన్ని కూడా గ్రంథ ప్రజలకు జ్ఞాపకం చెయ్యండి.** – సూరహ్ ఆలె ఇమ్రాన్ 3:187

తమ స్వంత ప్రయోజనాలను మరియు సమస్యలను దృష్టిలో పెట్టుకుని ధర్మప్రచారాన్ని వదిలిపేయటం తగదు. కొన్ని ప్రత్యేక తప్పని సరి

పరిస్థితులలో మాత్రమే అలా చేయవచ్చును. ఉదాహరణకు – ధర్మప్రచారంలో ఒక్కోసారి ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఎదురవటం. ధర్మప్రచారాన్ని ఇంకా కొన్నాళ్ళ పాటు కొనసాగించేందుకు వీలుగా ప్రాణాలు కోల్పోయే పరిస్థితుల నుండి తనను తాను కాపాడుకోవలసిన అవసరం ఏర్పడినప్పుడు, అతను దానిని తాత్కాలికంగా ఆపివేయవచ్చును.  కాని ఒకవేళ తప్పని సరిగా ధర్మప్రచారం చేయవలసిన సమయం ఆసన్నమైనప్పుడు, అల్లాహ్ యొక్క ధర్మాన్ని ఎలుగెత్తి చాటవలసిన అవసరం తప్పని సరి అయినప్పుడు, ధర్మప్రచారకుడు స్వయంగా ప్రాణాలర్పించటంలో వెనుకాడకూడదు.

3. నోటి మాటల ద్వారా ధృవీకరించటంతో పాటు, అల్లాహ్ యొక్క ధర్మం పై దృఢమైన విశ్వాసాన్ని ఆచరణల ద్వారా కూడా ధృవీకరించవలసి ఉన్నది. **ఇతరులనైతే సన్మార్గాన్ని అవలంబించమని ఆదేశిస్తున్నారు, కాని స్వయంగా మీరే దానిని అవలంబించటం మరచిపోతున్నారెందుకు?** –అల్ బఖరహ్ 2:44

4. మీలోని ఇతర లక్షణాలన్నింటి కంటే అల్లాహ్ పై దృఢవిశ్వాసం కలిగి ఉండటమనే ఈ లక్షణం,  అత్యున్నతంగా ఉండవలెను. **విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ కొరకు సత్యంపై స్థిరంగా ఉండండి. న్యాయానికి సాక్షులుగా ఉండండి. (ఏదైనా) వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనై న్యాయాన్ని త్యజించకండి. వారికి న్యాయం చెయ్యండి. ఇది దైవభక్తికి అతి చేరువైనది.** అల్ మాయిదహ్ 5:8

5. అల్లాహ్ యొక్క ధర్మం పై ధృవీకరణ స్వంత కోరికల(నఫ్స్ కీ ఖుర్బానీ) త్యాగంతో కూడినదై ఉండవలెను. ఒకవేళ అవసరమైతే ఇస్లాం ధర్మ ప్రచారం కోసం తమ ధనధాన్యాలను, వస్తుసామగ్రిని, సంపదను, సమయాన్ని త్యాగం చేయటానికి కూడా వెనుకాడ కూడదు. ఇంకా అవసరమైతే ప్రాణాలర్పించటానికి కూడా వెనుకాడకూడదు. అలాగే ఒకవేళ అత్యంత విలువైన మరియు అత్యంత ఇష్టమైన వాటిని కూడా అల్లాహ్ యొక్క ధర్మప్రచారం కోసం త్యాగం చేయవలసి వస్తే, వాటిని సంతోషంగా, మనస్ఫూర్తిగా అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టవలెను మరియు త్యాగం చేయవలెను. **మా కొరకు తీవ్రప్రయత్నాలు చేసే వారికి మేము మా మార్గాలను చూపుతాము, నిశ్చయంగా అల్లాహ్ సజ్జనులతో పాటే ఉంచాడు** – అన్కబూత్ 29:69

| 45 నిమిషాలు | ఈనాటి ధర్మప్రచార పద్ధతి | 7వ వారం |
|---|---|---|

ప్రవక్తల చరిత్రను జాగ్రత్తగా పరిశీలించినట్లయితే, మన ముందున్న ఈ ప్రస్తుత ప్రపంచ పరిస్థితులకు వారి కాలపు పరిస్థితులకు చాలా దగ్గరి సంబంధం కనబడును. అయితే ప్రస్తుత కాలంలో మన మార్గదర్శకత్వానికి అల్లాహ్ యొక్క అంతిమ గ్రంథం స్వచ్ఛమైన అసలైన రూపంలో మిగిలి ఉన్నదనటంలో ఎటువంటి సందేహమూ లేదు. ఇక ప్రళయం వరకు ఈ ప్రపంచానికి ఏ ప్రవక్తా మరియు ఏ మార్గదర్శకత్వమూ అవసరం లేదు. దీని గురించి దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు –

**ఈనాడు నేను మీ ధర్మాన్ని మీ కొరకు పరిపూర్ణం చేశాను. మీ పై నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను. మీ కొరకు ఇస్లాంను మీ ధర్మంగా అంగీకరించాను**. సూరహ్ అల్ మాయిదా 5:3

కాబట్టి మానవ జీవనవిధానం మన దగ్గర పరిపూర్ణ స్థితిలో ఉన్నది. ఇతరులకు మార్గదర్శకత్వం చేయటానికి మరియు ముస్లింలను సత్యధర్మంపై నిలకడగా ఉంచటానికి ఇది సరిగ్గా సరిపోతుంది.

## సత్యధర్మప్రచారాన్ని క్రమక్రమంగా ముందుకు తీసుకుపోవటం

### ప్రవక్తల ఆరంభపు ధర్మప్రచార విధానం:

సమాజంలో అరాచకం హద్దుమీరినప్పుడు, ప్రజలు తమ పూర్వీకుల అజ్ఞానపు, అంధకారపు, అసత్యపు మరియు అవిశ్వాసపు మూఢనమ్మకాలలో మునిగి పోయినప్పుడు, ప్రపంచంలో నలుమూలలా అహింస, అశాంతి ప్రబలిపోయినప్పుడు అల్లాహ్ తన ప్రవక్తలను పంపుతూ ఉండేవాడనేది ఒక వాస్తవమైన విషయం. అటువంటి క్లిష్టపరిస్థితులలో ప్రవక్తలు ఒక ఆదర్శవంతమైన ఇస్లామీయ సమాజాన్ని స్థాపించే దిశలో మొట్టమొదట సత్యధర్మపు తొలి నియమనిబంధనల వైపునకు, దాని మూలసిద్ధాంతాల వైపునకు ఆహ్వానించేవారు. ఈ మూడు నియమనిబంధనలు మరియు మూలసిద్ధాంతాలు అత్యంత ప్రధానమైనవి.

1. అల్లాహ్ పై విశ్వాసం అంటే అల్లాహ్ యొక్క సార్వభౌమత్వం (తౌహీదె రుబూబియ్యహ్) తో పాటు ఏకదైవారాధన (తౌహీదె ఉలూహియ్యహ్) వైపునకు ఆహ్వానించటం.
2. ప్రవక్తలపై విశ్వాసం అంటే అల్లాహ్ యొక్క ప్రవక్తలకు పూర్తి విధేయత చూపమని ఆహ్వానించటం.
3. ప్రళయదినం పై విశ్వాసం అంటే మొత్తం విషయాలను అల్లాహ్ కే వదిలివేసి, ఆయన ఆదేశాల ప్రకారమే జీవించమని ఆహ్వానించటం

| 45 నిమిషాలు | ధర్మప్రచారంలో ప్రవక్తల ప్రత్యేక పద్ధతి | 9వ వారం |
|---|---|---|

## అల్లాహ్ వైపు ఆహ్వానించటంలో ప్రవక్తల బోధనా పద్ధతి యొక్క ప్రత్యేకతలు

నిశ్చయంగా ప్రవక్తలు తమ తమ సమాజాలను అల్లాహ్ వైపు పిలిచే ఉన్నత విధానం, తియ్యటి మాధుర్యపు పలుకులతో కూడిన వారి ఉత్తమ బోధనలు ప్రజలపై మంచి ప్రభావం చూపేవి, వారి హృదయాలలో చొచ్చుకుని పోయేవి. ఏ ప్రాంతంలో లేక ఏ కాలంలో నైనా సరే, సత్యధర్మప్రచార బాధ్యత నెరవేర్చాలనుకునే ధర్మప్రచారకులు, క్రింద తెలిపిన ప్రవక్తల యొక్క సున్నహ్ ను అంటే ఈ విశేష లక్షణాలను, గుణగణాలను, స్వభావాన్ని ఎంత మాత్రమూ తేలికగా తీసుకోరాదు.

1. తమ సమాజములలో ప్రవక్తలు వారి భాషలోనే, వారి యాసలోనే, వారి పద్ధతి ననుసరించే బోధించేవారు.
**మేము మా సందేశాన్ని అందజేసే నిమిత్తం ప్రవక్తను పంపినప్పుడల్లా, అతడు తన జాతి ప్రజలు మాట్లాడే భాషలోనే మా సందేశాన్ని**

**అందజేశాడు, వారికి అతడు విషయాన్ని చక్కగా అర్థమయ్యేటట్టు తెలియజేయటానికి.** సూరహ్ ఇబ్రాహీం 14:4

2. ప్రవక్తల పలుకులు సరళంగా, సులభతరంగా సామాన్య ప్రజలకు కూడా అర్థమయ్యే విధంగా ఉండేవి. వారు అక్కడి ప్రజల మాట్లాడే తీరుతెన్నుల, ఆచార వ్యవహారాలను అనుసరించి, ఎలాంటి సందేహాస్పదాలకు తావులేని విధంగా తమ లక్ష్యాన్ని సులభంగా, తేలికగా పూర్తి చేసుకునేటట్లు సంభాషించే వారు.

3. ఈ ఉత్తమ గుణాలతో పాటు ప్రవక్తలు మరియు ధర్మప్రచారకులు అనేక రకాల పద్ధతులను, విధానాలను ధర్మప్రచారంలో ఉపయోగించేవారు. ఈ విషయాన్ని దివ్యఖుర్ఆన్ (تصريف الآيات) అనే వచనంలో ధృవీకరించెను. అంటే ఒక వాస్తవాన్ని వివరించటానికి మరియు దానిని గ్రహింపజేయటానికి రకరకాలైన వివిధ పద్ధతులు, విధానలు ఉపయోగపడును.

4. ప్రజలలో ధైర్యసాహసాలను నింపే విధంగా ధర్మప్రచారకుల పలుకులు ఉండవలెను. వారి హృదయాలను మెత్తపరచేటట్లుగా, కారుణ్యంతో నింపేటట్లుగా, శాంతపరచేటట్లుగా ఉండవలెను. ఫిలాసఫీల మాదిరిగా

కేవలం మానవుడి ఆలోచనలను మరియు మానవాత్మను మాత్రమే ప్రవక్తలు లక్ష్యం చేసేవారు కాదు. అది సూఫీలు అనుసరించే విధానం. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క మాట్లాడే విధానంలో ఎదుటి వాని మనస్సులో దాగి ఉన్న ఆణిముత్యాలను

5. బయటకు వచ్చేటట్లు చేసేవారు. ఇంకా వారిలోని ఆత్మవిశ్వాసాన్ని మేలుకొలిపే వారు.

ఉపదేశం చేసేటప్పుడు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క పవిత్రమైన కళ్ళు ఎర్రగా మారిపోయేవి. కంఠస్వరం తీవ్రస్థాయికి చేరుకునేది. పలుకులు వేగంగా మరియు గంభీరంగా వచ్చేవి. మీ పై శత్రుసైన్యం ఏ సమయంలో నైనా దాడి చేయవచ్చనే ముఖ్య సమాచారాన్ని తన సైన్యానికి తెలియజేస్తూ, వారిని జాగ్రత్తగా ఉండమని హెచ్చరిస్తున్నట్లుగా వారి ఉపదేశం ఉండేది. అల్లాహ్ పై వారికున్న దృఢవిశ్వాసం యొక్క ఫలితమే వారి ఉపదేశములలోని ఆ తీవ్రస్థితి మరియు ఆ వేడి. ఇంకా వినాశనం వైపు శీఘ్రంగా సాగిపోతున్న మానవ సమాజం పై వారి తీవ్రమైన దు:ఖానికి మరియు నశించిపోతున్న మానవత్వం గురించిన ఆయన తపన మరియు కారుణ్యపు ప్రతిస్పందనలే వారి ఉపదేశాలను అలా వాడిగా, వేడిగా ఉంచేవి. ఈ లక్షణాల వలననే ధర్మప్రచారకుల ఉపదేశాలు ఏ ఏ ప్రదేశాలలో నైనా , ఏ ఏ సమయాలలో నైనా సరే ఇతరుల ఉపదేశాల కంటే ఉన్నతంగా, ప్రయోజనకరంగా ఉంటాయి.

ఇక్కడి నుండే అసత్యం నుండి సత్యాన్ని వేరు చేసే, అసత్యపు స్వార్థ జీవితం వైపునకు దారి చూపే వారి నుండి అల్లాహ్ యొక్క మార్గదర్శకత్వం వైపునకు పలిచే ధర్మప్రచారకులను వేరు చేసే, ధర్మప్రచారకుడిని అధర్మప్రచారకుడి నుండి వేరుచేసే, క్రొత్త ధర్మాలను,

మతాలను, సిద్ధాంతాలను, ఫిలాసఫీలను ప్రచారం చేస్తూ మార్గభ్రష్టత్వం వైపు మళ్ళించే, సందిగ్దంలో పడ వేసే అసత్యం వైపు పిలిచే వారి నుండి స్వచ్ఛమైన, స్పష్టమైన సత్యం వైపు పిలిచే వారిని వేరే చేసే మార్గాలు వేరవుతాయి.

6. ప్రవక్తలందరి పిలుపు ఒకటే. వారు తమ అంబుల పొదిలోని ప్రతి బాణాన్ని ఒకే లక్ష్యం వైపునకు గురి పెట్టే వారు. దీని కారణంగా ప్రవక్తలు తమ సంభాషణా సమయాలలో తమ ఉత్తమ విధానం పై మరియు ఇస్లామీయ నియమ నిబంధనలను పాటించటం పై పూర్తి దృష్టి కేంద్రీకరించేవారు మరియు చర్చలలో తమ దివ్యసందేశం పై సంపూర్ణ విశ్వాసాన్ని వ్యక్తపరచేవారు.

7. తాము వాడుతున్న పదాలలో తేలికగా, స్పష్టంగా అర్థమయ్యే పదాలు ఉండేటట్లు దైవప్రవక్తలు జాగ్రత్త వహించేవారు. ఇంకా సంభాషణను ఎక్కడ పొడిగించాలి, ఎక్కడ క్లుప్తంగా ముగించాలి అనే విషయంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపించేవారు. ఎదుటివారి ప్రవర్తనను, స్వభావాన్ని మరియు ఇష్టాయిష్టాలను దృష్టిలో ఉంచుకుని సంభాషించే విధానాన్ని, చర్చించే పద్ధతిని అవలంబించేవారు. ఉదాహరణకు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించేవారు– "يسروا و لا تسروا و

"بشروا ولا تنفروا" అంటే సులభతరం చేయండి అంతేగాని కఠినం చేయవద్దు, శుభసందేశాలను వినిపించండి అంతేగాని ప్రజలను సత్యధర్మానికి దూరమయ్యేటట్లు చేయవద్దు.

8. ప్రవక్తల సంభాషణ ఉన్నతమైనదిగా, ఉత్తమమైనదిగా మరియు మనస్సుకు హత్తుకుపోయేటట్లుగా ఉండేది. తమ సంభాషణ వింటున్న ఎదుటివారి హృదయాలలో ఏహ్యాభావం, అసహ్యం, సందిగ్ధం, అనుమానం, అస్పష్టత, అహంభావం, అధర్మపు ఆలోచనలు, తలబిరుసుతనం, వ్యతిరేక భావాలను మేల్కొలిపే విషయాలు లేకుండా జాగ్రత్త వహించేవారు. దీని గురించి ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు – **"మీరిద్దరూ (మూసా మరియ హారూన్ అలైహిస్సలాంలు) కలసి ఫిరౌన్ వద్దకు వెళ్ళండి, అతడు ధిక్కారి అయిపోయాడు. అతనితో మృదువుగా మాట్లాడండి, బహుశా అతడు హితబోధను స్వీకరిస్తాడేమో లేదా (అల్లాహ్ కు) భయపడతాడేమో"** సూరహ్ తాహా 20:44

**"చక్కని హితబోధతో నీ ప్రభువు మార్గం వైపునకు ఆహ్వానించు. ప్రజలతో ఉత్తమోత్తమమైన రీతిలో వాదించు"** సూరహ్ అన్నహల్ 16:125

కాబట్టి ప్రజల హృదయాలు సత్యధర్మానికి దూరమయ్యే పదాలను మరియు పలుకులను ప్రవక్తలు వాడేవారు కాదు. తమలోని మూఢాచారలను, అవిశ్వాసాన్ని, సత్యతిరస్కారాన్ని దూరం చేసే విధంగా వారి పలుకులు ప్రజలను ప్రోత్సహించేవి. దీని గురించి ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు – **"అల్లాహ్ ను కాదని వారు ఆరాధిస్తున్నవాటిని దూషించకండి. ఎందుకంటే వారు బహుదైవారాధన**

**(షిర్కు) కంటే ఇంకా ముందుకు పోయి అజ్ఞానం చేత అల్లాహ్ నే దూషిస్తారేమో.**" సూరహ్ అల్ అన్ ఆమ్ 6:108

కాబట్టి ప్రవక్తలు అవిశ్వాసుల కఠిన పలుకులకు మరియు అసభ్యకర పదాలకు తియ్యటి మాధుర్యంతో కూడిన మెత్తని పలుకులతో జవాబు ఇచ్చేవారు. ఎదుటివారి కఠినత్వానికి జవాబుగా మృదుస్వభావాన్ని ప్రదర్శించేవారు. ఎందుకంటే ప్రజల హృదయాలలో చొచ్చుకుని పోయే మార్గం కేవలం ఇదొక్కటే.

| | | |
|---|---|---|
| **45 నిమిషాలు** | **అల్ వలా – అల్ బరా**<br>**ధర్మప్రచారకుడి ఇష్టాయిష్టాలు** | **10వ వారం** |

## ధర్మప్రచారంలో ఎదుటివాని మనస్తత్వానికి, స్వభావానికి ప్రాముఖ్యత నివ్వటం

అధిక దిగుబడి పొందటానికి మేలుజాతి విత్తనంతో పాటు సారవంతమైన భూమి మరియు అనుకూలమైన వాతారవరణం కూడా ఎంతో అవసరం. మేలుజాతి విత్తనం వంటి సత్యధర్మవచనం యొక్క పరిస్థితి కూడా సరిగ్గా ఇలాగే ఉన్నది. దీనిలో స్వచ్ఛమైన, అసలైన సత్యం మరియు ధర్మం ఉన్నా కూడా, దీనిని ఎదుటివానికి అందజేసేటప్పుడు, అతని యొక్క మనస్తత్వాన్ని, స్వభావాన్ని గమనించటం ప్రతి ధర్మప్రచారకుడి పై ఉన్న కనీస బాధ్యత. ఎందుకంటే,

మానవ హృదయాలు రోజువారి ప్రాపంచిక వ్యవహారాల ఒత్తిడి మరియు సమస్యల మధ్య జీవనం సాగిస్తూ ఉంటాయి.

కాబట్టి దేనినైనా స్వీకరించటం లేదా తిరస్కరించటమనేది వారి ఆయా పరిస్థితుల పై ఆధారపడి ఉంటుంది. అతనిలోని ఆసక్తి, కుతూహలం లేక నిర్లక్ష్యం అనేవి అతడిని ముందడుగు వేసి సత్యధర్మాన్ని స్వీకరించే మార్గంలో లేదా దానిని వెనక్కు నెట్టివేసి తిరస్కరించే మార్గంలో నడిపిస్తుంది. అతడి ఈ పరిస్థితి ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉండదు. వాతావరణపు ఋతువులు మారుతున్నట్లుగా అది మారుతూ ఉంటుంది. ఏ విషయానికైనా ఒక సమయం అనుకూలమైనది కావచ్చు లేదా ప్రతికూలమైనది కావచ్చు. కాబట్టి రైతులు ఋతుపవనాల గురించి, వాతావరణం గురించి తెలుసుకునే విద్యలలో నైపుణ్యం సంపాదిస్తున్నట్లుగా, ధర్మప్రచారకులు ఎదుటి వాని మనస్తత్వాన్ని తెలుసుకునే సైకాలజీ వంటి విద్యలను నేర్చుకుని, దానిలో అనుభవం సంపాదించవలెను.

## ఎదుటివాని పరిస్థితిని గమనిస్తూ, ధర్మప్రచారాన్ని కొనసాగించటం

ఈ విషయంలో కొన్ని నియమనిబంధనలను అనుసరించవలసి ఉన్నది. ప్రవక్తల ధర్మప్రచార పద్ధతులలోని క్రింద తెలిపిన కొన్ని నియమనిబంధనల, షరతుల, విధానాలను మనం కూడా పరిశీలించ

వలెను. ఎందుకంటే ప్రపంచంలోని వివిధ మానవులను అర్థం చేసుకోవటంలో దీని సంబంధం ఉన్నది. ఒక ధర్మప్రచారకుడికిది బాగా సహాయపడును. ఒక మంచి ప్రావిణ్యం గల ధర్మప్రచారకుడు, కేవలం

అల్లాహ్ కోసమే ధర్మప్రచారం చేస్తున్న చిత్తశుద్ధితో, ధర్మప్రచారపు ప్రయోజనాలు, లాభాలు తెలుసుకుని, దాని వలన కలుగబోయే ఫలితాల లోతుపాతులను సరిగ్గా గుర్తించి, ప్రయత్నం చేసినట్లయితే. ఎదుటివానికి అతను సులభంగా సత్యధర్మం వైపునకు ఆహ్వానించ వచ్చును. అతి త్వరలోనే అతను తన ధర్మప్రచార విధానానికి మరియు ప్రవక్తల ధర్మ ప్రచార విధానానికి మధ్య ఉన్న దూరాన్ని తగ్గించగలడు.

## మొదటి నియమం: సులభతరం

ప్రతి విషయానికి అనేక దారులు, దిశలు, పద్ధతులు, విభాగాలు ఉంటాయి. కొన్ని పద్ధతులలో సౌకర్యం, అనుకూలత మరియు సులభత్వం ఉంటాయి. కొన్నింటిలో అసౌకర్యం, సమస్యలు, కష్టాలు ఉంటాయి. మీరు గనుక ఎదుటి వాని ముందు సత్యధర్మాన్ని కష్టమైనదిగా, కఠినమైనదిగా, సమస్యలతో కూడినదిగా, అసౌకర్యవంతమైనదిగా పరిచయం చేసినట్లయితే అతను జీవితంలో మళ్ళీ అటువైపు చూడకుండా దూరమైపోవచ్చును. దాని వలన మీ ఆహ్వానాన్ని తిరస్కరించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అలా కాకుండా సత్యధర్మంలోని ఆహ్లాదకరమైన, సులభమైన,

సౌకర్యవంతమైన విషయాలను ఇతరుల ముందు పెట్టినట్లయితే, వారు దానిని మనస్ఫూర్తిగా స్వీకరించటానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బోధించినారు

**يسروا و بشروا و لا تنفروا**

**అనువాదం** - సులభం చేయండి, కఠినం చేయవద్దు మరియు శుభవార్తలు వినిపించండి , నిరాశ పడనివ్వకండి.

ఇంకోచోట ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బోధించారు

**" انما بعثتم میسرین و لم تبعثوا معسرین"**

**అనువాదం** – ఈ విషయాన్ని మీరు చాలా జాగ్రత్తగా గ్రహించండి – మీరు జీవితాన్ని సులభతరం చేయటానికి పుట్టించబడినారు మరియు పంపబడినారు అంతేకాని మీరు కష్టాలను పెంచటానికి కాదు.

## రెండవ నియమం: రెచ్చగొట్టకూడదు

ధర్మప్రచారంలో నిలకడగా వేయవలసిన ఇంకో అడుగు ఏమిటంటే అయిన ఎదటివాని లోపల దాగి ఉన్న అజ్ఞానాన్ని, దుష్టత్వాన్ని మేలుకొల్పే విధంగా అస్సలు ప్రవర్తించకూడదు. ఇతర ధర్మాలను గౌరవించటం, వారి ఆచారవ్యవహారాలకు తగిన మర్యాదనివ్వటం, వారి సుఖదుఖాలలో పాలు పంచుకోవటం మొదలైనవి ప్రతి ధర్మప్రచారకుడు పాటించ వలెను. వారి ధర్మాచారలను విమర్శించటం మంచిది కాదు. ఎందుకంటే ఎదుటివాని లోపలి విషయాలపై విమర్శించటమంటే కష్టాలను స్వయంగా కొని తెచ్చుకున్నట్లే మరియు భయంకర ఫలితాలను స్వయంగా ఆహ్వానించినట్లే.

దీని కారణంగా అతను మీ ఆహ్వానాన్ని తిరస్కరించవచ్చును. ఇంకా అతనిలో దాగి ఉన్న వ్యతిరేకత భావాలు మేల్కొన వచ్చును. ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు (అల్ ఫతహ్ 26): **"ఈ అవిశ్వాసులు తమ హృదయంలో మూఢాభిమానాన్ని పెంచుకున్నప్పుడు..."**

కొన్ని సందర్భాలలో అటువంటి వ్యతిరేకత అతనిలో ధర్మప్రచారకుడిపై శత్రుత్వాన్ని పెంచును. ధర్మప్రచారకుడిని అపహాస్యం, అవమానం పాలు చేయటానికి పురిగొల్పును. దీని గురించి ఖుర్ఆన్ లో స్పష్టంగా ఇలా తెలుపబడినది (అల్ అన్ఆమ్ 108) – **"వారు అల్లాహ్ ను కాదని వేడుకునే ఇతరులను దూషించకండి. ఎందుకంటే వారు షిర్కు కంటే ఇంకా ముందుకు పోయి అజ్ఞానం చేత అల్లాహ్ ను దూషిస్తారేమో. ఈ విధంగా మేము ప్రతి వర్గం వారికి వారు చేసే పనులు ఆకర్షకంగా ఉండేలా చేశాము."**

ఖుర్ఆన్ లో మరొక చోట అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు – **"ప్రవక్తా! నా దాసులకు వారు తమ నోట అత్యుత్తమమైన మాటనే పలుకుతూ అండాలి అని చెప్పు. అసలు మానవుల మధ్య కలహాన్ని సృష్టించటానికి ప్రయత్నం చేసేవాడు షైతానే. నిజానికి షైతాను మానవుడికి బహిరంగ శత్రువు. మీ ప్రభువు మీ పరిస్థితిని బాగా ఎకుగును. ఆయన తన ఇష్టప్రకారం మిమ్మల్ని శిక్షిస్తాడు. ప్రవక్తా! మేము నిన్ను ప్రజలకు సంరక్షకుడుగా నియమించి పంపలేదు. భూమ్యాకాశాలలోని ప్రాణికోటిని నీ ప్రభువు బాగా ఎరుగును. మేము కొందరు ప్రవక్తలకు మరికొందరు ప్రవక్తల కంటే ఉన్నత స్థానాలను ప్రసాదించాము. మేము దావూదుకు జబూర్ గ్రంథాన్ని ప్రసాదించాము."**

| 45 నిమిషాలు | అల్ వలా – అల్ బరా<br>ధర్మప్రచారకుడి ఇష్టాయిష్టాలు | 11వ వారం |
|---|---|---|

## మూడవ నియమం: ఎదుటి వానికి తగిన గౌరవమర్యాదలు ఇవ్వటం, ప్రశంసించటం.

ఎదుటి వారిని ఆకర్షించటానికి, వారిలోని మంచి గుణాలను ప్రశంసించవలెనని కొందరి అభిప్రాయం. మాటల్లో, వారి గొప్పతనానికి, సమాజంలో వారి ప్రత్యేక స్థానానికి తగిన గౌరవాభిమానాలు ఇవ్వవలెను. కీర్తిప్రతిష్ఠల పట్టింపు వీరిలో ఎంతవరకు పెరిగి పోయినదంటే, తమకు ప్రత్యేక స్థానం ఇవ్వని వారి ఆహ్వానాన్ని నిరాకరించటానికి ఎంత మాత్రమూ ఆలోచించరు. తమకు తగిన స్థానం ఇవ్వలేదనే వంకతో వారి పిలుపును అస్సలు స్వీకరించరు. అటువంటి చిన్న చిన్న బలహీనతలు సత్యధర్మాన్ని దగ్గర నుండి చూసే అవకాశాన్ని జారవిడుచుకునేటట్లు చేయును.

ఈ విధంగా వారు సత్యధర్మ పిలుపును గమనించి, దానిపై ఆలోచించే అవకాశాన్ని పోగొట్టుకుంటారు. ఇటువంటి వారి మనస్తత్వాన్ని, వారి బలహీనతలను గమనించి, వారిని సరైన మాటలతో సత్యధర్మం వైపునకు పిలవటానికి ప్రతి ప్రచారకుడు ప్రయత్నించవలెను. సత్యధర్మం వైపు మరలటాన్ని నిరోధించే, ఆటంకం కలిగించే ప్రతి చిన్న, పెద్ద విషయం

పై ధర్మప్రచారకుడు ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవలెను. దీని కారణంగా అల్లాహ్ తన ప్రవక్తలు మూసా & హారూన్ అలైహిస్సలాంలకు ఇలా ఆదేశించినాడు (తాహా 20:43-44) – **“మీరిద్దరూ ఫిరౌన్ వద్దకు**

**వెళ్ళండి. అతడు ధిక్కారి అయిపోయాడు. అతనితో మృదువుగా మాట్లాడండి, బహుశా అతడు హితబోధను స్వీకరిస్తాడేమో లేదా (అల్లాహ్)కు భయపడతాడేమో "** ఖుర్ఆన్ లో మరొకచోట అల్లాహ్ ఇదే విషయం గురించి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కు ఇలా ఆదేశించినాడు (ఆలె ఇమ్రాన్ 3:159) – **"(ప్రవక్తా!) అల్లాహ్ యొక్క అనంత కరుణ వల్లనే నీవు వారి పట్ల మృదుస్వభావుడవు అయ్యావు. నీవే గనుక కఠిన హృదయుడవు అయినట్లయితే వారందరూ నీ చుట్టుప్రక్కల నుండి దూరంగా వెళ్ళిపోయేవారు. 'వారి తప్పులను మన్నించు, వారిని క్షమించు' అని అల్లాహ్ ను ప్రార్థించు."**

కాబట్టి ఎదుటి వానితో మృదువుగా, మెత్తగా మాట్లాడే విధానాన్ని అతను సత్యధర్మం గురించి అర్థం చేసుకునే వరకైనా కనీసం పాటించవలెను. మాట్లాడే విధానం ఆటంకం కాకుండా చూసుకోవలెను. అలాగే ధర్మప్రచారకుడు తనపై ఏ విధమైన ఆరోపణలు, నిందలు చేయగలిగే, వేలెత్తి చూప గలిగే అవకాశాన్ని అతనికి ఇవ్వకుండా జాగ్రత్త పడవలెను. అలాంటివి సత్యధర్మప్రచారంలో ఆటంకం కలిగిస్తాయి. ఎదుటి వ్యక్తికి తగిన గౌరవమర్యాదలు ఇవ్వమని, అతని కీర్తిప్రతిష్టలకు సరైన స్థానమిచ్చి మాట్లాడమని మన ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధించియున్నారు.

## నాలుగవ నియమం: వ్యతిరేకిస్తున్నప్పుడు దూరంగా ఉండటం

ఎదుటి వ్యక్తి గనుక తనను తిరస్కరించటానికి, వ్యతిరేకించటానికి పూనుకున్నట్లుగా ధర్మప్రచారకుడు గమనించినట్లయితే, అటువంటి

పరిస్థితిలో అతనిని సత్యధర్మం వైపునకు పిలవకుండా ఆగిపోవలెను. ఎదుటి వ్యక్తి తన ప్రతిమాటకు అడ్డు తగులుతూ, ఎగతాళి చేస్తూ. తనపై బురద జల్లుతూ, తనను అవమాన పరుస్తూ, రకరకాల ఆటంకాలు కల్పిస్తున్నట్లయితే ధర్మప్రచారకుడు తన సంభాషణను వెంటనే ఆపివేసి, అతని నుండి ముఖం తిప్పుకోవలెను. అతని నుండి దూరంగా వెళ్ళిపోవలెను. ఆ వ్యక్తిని అతని యొక్క స్వంత పరిస్థితులపై వదిలివేయవలెను. దూరంగా కూర్చుని తగిన సమయం కోసం నిరీక్షించవలెను. ఎదుటి వ్యక్తిలో విషయాన్ని స్వచ్ఛమైన మనస్సుతో గంభీరంగా, సీరియస్ గా గమనించగలిగే మార్పు కలిగినప్పుడు, అతని హృదయం ధర్మప్రచారంలోని సత్యాన్ని స్వీకరించే స్థాయికి చేరుకుంటుంది.

ఇదే విషయాన్ని ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు (అల్ అన్ ఆమ్ – 6:68) - **"ప్రవక్తా! ప్రజలు గనుక మా ఆయతులలో తప్పులెన్నటాన్ని నీవు గమనిస్తే వారి మధ్య నుండి తొలగిపో. వారు ఈ ప్రసావనను వదిలిపెట్టి మరో విషయాన్ని గురించి మాట్లాడటం మొదలుపెట్టేవరకు. ఒకవేళ నిన్ను షైతాను ఎప్పుడైనా ఏమరుపాటుకు గురిచేస్తే, నీవు ఈ పొరపాటును గ్రహించిన తర్వాత, మళ్ళీ అటువంటి**

**దుర్మార్గుల వద్ద కూర్చోవద్దు."** చర్చలలో ఎదుటివానితో ఎక్కువగా వాదులాడటం తగదనే విషయం కూడా దీనిలో స్పష్టం చేయబడినది. ఇంకా అటువంటి వారి వెనుక ఎక్కువ సమయం వెచ్చించనవసరం లేదనే విషయం కూడా ఇక్కడ స్పష్టమవుతున్నది.

## ఐదవ నియమం: తన ప్రపంచంలో నిమగ్నమై ఉన్నప్పుడు అతడిని ఇబ్బంది పెట్టవద్దు.

ఎదుటి వ్యక్తి తనకిష్టమైన వారితో మాట్లాడుతున్నప్పుడు, లేక తన ప్రపంచంలో నిమగ్నమై ఉన్నప్పుడు అతడిని చిరాకు పెట్టవద్దు. తనకిష్టమైన పనిని వదిలి పెట్టి, అతడు మీ పిలుపు వైపునకు తన ధ్యానాన్ని మళ్ళించటమనేది చాలా కష్టమైన పని. అటువంటి సమయంలో ధర్మప్రచారకుడు తన ప్రచారాన్ని అతడి ముందు పెట్టకుండా ఆగిపోవటం మంచిది. ఇటువంటి పరిస్థితి నాలుగవ నియమంలో వివరించిన పరిస్థితి కంటే భిన్నమైనది. ఎందుకంటే దీనిలో అహంకారం, అసత్యవాదనల పై ఆధారం, దుష్టస్వభావం లేవు. అయితే రెండు పరిస్థితులలోనూ ఉన్న కామన్ విషయం ఏమిటంటే, ఎదుటి వ్యక్తి ధర్మప్రచారకుడి మాటలు వినే స్థితిలో లేకపోవటం మరియు ఆ పిలుపును పరిశీలించే, గ్రహించే, స్వీకరించే పరిస్థితి లేకపోవటం.

సహీహ్ బుఖారీ గ్రంథంలో నమోదు చేయబడిన అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ రదియల్లాహు అన్హుమా ఉల్లేఖనలో ఇలా తెలుపబడినది – మీరు

ప్రతి శుక్రవారం ప్రజలకు మంచి విషయాల గురించి ఒకసారి ఉపన్యాసం ఇవ్వండి. ఇంకా ఎక్కువ సార్లు ఇవ్వాలని మీరు అనుకున్నట్లయితే, వారానికి రెండు సార్లు గాని, మూడు సార్లు గాని ఇవ్వండి. అంతకంటే ఎక్కువసార్లు ఉపన్యాసం ఇవ్వవద్దు. హృదయాలు ఇబ్బంది పడే విధంగా మీరు ప్రజలను ఖురఆన్ వైపునకు పిలుపవద్దు.

ఒక్కోసారి ధర్మబోధన చేయటం కోసం మీరు ప్రజలు వద్దకు వెళ్ళినప్పుడు, వారు తమ సంభాషణలలో నిమగ్నమై ఉండటం గమనించి కూడా ధర్మబోధన చేయడం మొదలు పెట్టినట్లయితే, వారి హృదయాలు కుదించిపోయి, దానిని తిరస్కరించే పరిస్థితికి చేరుకోవచ్చును. కాబట్టి మీరు అటువంటి పరిస్థితులలో నిశ్శబ్దంగా నిరీక్షించ వలెను. వారు గనుక బోధించమని మిమ్మల్ని కోరినట్లయితే, వారు ఇష్టపడే విధంగా బోధించవలెను.

## ఆరవ నియమం: మరీ తరచుగా ధర్మబోధన చేయకుండా ఉండటం.

ఎదుటి వ్యక్తి ఒంటరి వాడైపోయినట్లు, ఏకాకి అయిపోయినట్లు అనిపించే విధంగా మీరు అతనితో ప్రవర్తించ కూడదు అనే విషయాన్ని బాగా

జ్ఞాపకం ఉంచుకోవలెను. ఎదుటి వ్యక్తికి బాధ కలిగించే మాటలు, పరిస్థితులకు అనుకూలం కాని అనవసరమైన దీర్ఘ సంభాషణ మొదలైన వాటి నుండి దూరంగా ఉండవలెను. ఈ విషయంలో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తో పాటి వారి సహచరులు కూడా చాలా జాగ్రత్త వహించినట్లు చరిత్రలో మనకు ఎన్నో ఋజువులు లభిస్తాయి.

షఖీఖ్ రదియల్లాహ్ అన్హు ఇలా ఉల్లేఖించినారు – అబ్దుల్లాహ్ ఇబ్నె మస్ఊద్ రదియల్లాహు అన్హు ప్రతి గురువారం ప్రజలకు ధర్మబోధన చేసేవారు. అయితే ఒకసారి ఒక వ్యక్తి వారితో ఇలా పలికినాడు – ఓ అబూ

అబ్దుర్రహ్మాన్, మీరు ప్రతిరోజు మాకు ధర్మబోధన చేస్తే బాగుంటుందని నా మనస్సు కోరుతున్నది. దానికి జవాబుగా ఆయన ఇలా పలికినారు – అలా చేస్తే ధర్మబోధన మీకు బోరుగా అనుపించ వచ్చును అనే ఆలోచన నన్ను అలా చేయటం నుండి ఆపుతున్నది. అలా జరగటం నాకిష్టం లేదు. అయితే నేను మీకు అప్పుడప్పుడూ ధర్మబోధన చేస్తుంటాను. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కూడా మాకు ధర్మబోధన బోరు కొట్టకుండా, మా హృదయాల పరిస్థితిని గమనిస్తూ, మాకు ఉపదేశం చేసేవారు. బుఖారీ మరియు ముస్లిం హదీథ్ గ్రంథాలు.

## ఏడవ నియమం: లభించే అవకాసాన్ని సరిగా ఉపయోగించుకోవటం

ప్రతి ధర్మప్రచారకుడు ఎల్లప్పుడూ ధర్మప్రచారం కోసం తయారుగా ఉండవలెను. తమకు లభఇంచే అవకాశాన్ని వదులుకోకుండా, సరిగ్గా వినియోగించవలెను. దాని కోసం అతను ఎల్లవేళలా తయారుగా ఉండవలెను. అవకాశం దొరికినప్పుడల్లా ధర్మప్రచారం చేయటానికి అతను రడీగా ఉండవలెను. దానికి అవసరమైన విషయాలు ఎల్లప్పుడూ నెమరు వేసుకుంటూ, తన జ్ఞాపకంలో తయారు ఉంచుకోవలెను. దీనికి ఒక మంచి ఉదాహరణ – యూసుఫ్ అలైహిస్సలాం అవకాశాన్ని చూసి, సరైన సమయంలో చేసిన ధర్మబోధన.

ఈ విషయం ఖుర్ఆన్ లో ఇలా తెలుపబడినది (యూసుఫ్ 36 – 41) – **జైలులో అతనితో పాటు ఇంకా ఇద్దరు బానిసలు కూడా ప్రవేశించారు.**

ఒకనాడు వారిలో ఒకడు ఇలా అన్నాడు: "నేను సారాయి పిండుతూ ఉన్నట్లు నన్ను నేను కలలో చూశాను" రెండో అతను ఇలా చెప్పాడు " నా తలపై రొట్టెలు ఉన్నాయి, వాటిని పక్షులు తింటున్నట్లు నేను చూశాను" ఉభయులూ ఇలా అడిగారు:

"మాకు వాటి భావం వివరించు, మేము చూస్తూ ఉన్నాము, నీవు చాలా మంచి వాడవు" యూసుఫ్ ఇలా అన్నాడు "ఇక్కడ మీకు ఇవ్వబడే భోజనం రాకముందు నేను ఈ స్వప్నాల భావాన్ని మీకు వివరిస్తాను. ఇది నా ప్రభువు నాకు ప్రసాదించిన విద్యలలోనిదే. అసలు విషయం ఏమిటంటే, అల్లాహ్ ను విశ్వసించని వారి, పరలోకాన్ని తిరస్కరించేవారి విధానాన్ని నేను వదిలిపెట్టి, నా పెద్దలైన ఇబ్రాహీం, ఇస్ హాఖ్, యూఖూబ్ ల

విధానాన్ని అవలంబించాను. ఎవడినైనా అల్లాహ్ కు భాగస్వామిగా చెయ్యటం మా విధానం కాదు. వాస్తవానికి ఇది అల్లాహ్ అనుగ్రహమే మనపైనా, సమస్త మానవులపైనా. కాని చాలామంది ప్రజలు కృతజ్ఞతలు చూపరు.

నాతోటి ఖైదీలారా! స్వయంగా మీరే ఆలోచించండి, చాలా మంది విభిన్న ప్రభువులు మేలా లేక సర్వశక్తిమంతుడైన ఏకైక దేవుడు అల్లాహ్ మేలా? ఆయనకు కాదని మీరు దాస్యం చేస్తున్నవారు, మీరూ మీ తాతముత్తాతలూ కల్పించుకున్న కొన్ని పేర్లు మాత్రమే తప్ప మరొకటేమీ కాదు. వారి కొరకు అల్లాహ్ ఏ నిదర్శనాన్నీ అవతరింపజేయలేదు. పరిపాలించే అధికారం అల్లాహ్ కు తప్ప మరొకరికి లేదు. ఆయనను తప్ప మీరు ఎవరి దాస్యాన్నీ చెయ్యకూడదని ఆయన ఆజ్ఞ. ఇదే శుద్ధమైన, సరియైన జీవిత విధానం. కాని ఇది చాలా మందికి తెలియదు.

**తోటి ఖైదీలారా! మీ స్వప్నాలకు ఇదిగో, మీలో ఒకడు తన ప్రభువునకు త్రాగటానికి మధువును అందిస్తాడు. ఇక రెండో అత శిలువ వేయబడతాడు. పక్షులు అతని తలను పొడిచి పొడిచీ తింటాయి. మీరు అడిగిన విషయము పరిష్కారమై పోయినది.”** దీని వివరణ ఇలా ఉన్నది – కొన్ని అసత్యపు ఆరోపణల వలన ఒకసారి ప్రవక్త యూసుఫ్ అలైహిస్సలాం జైలులో ఉంచబడినారు. అదే కాలంలో ఇద్దరు ఖైదీలు ఆయన ఉన్న జైలుకు తీసుకుని రాబడినారు. ఒకరాత్రి వారిద్దరూ ఒక అద్భుతమైన కల గన్నారు. దానికి అర్థం ఏమిటో తెలుసు కోవాలనే ఆతృత వారిలో కలిగినది.

చుట్టుప్రక్కల ఉన్న ఖైదీలందరినీ పరిశీలించగా, యూసుఫ్ అలైహిస్సలాం వారి కంటిలో పడినారు. కేవలం ఆయన మాత్రమే వారికి సహాయపడగలరనే అభిప్రాయం వారికి కలిగినది. వెంటనే వారిద్దరూ తమకు వచ్చిన కల గురించి వివరిస్తూ, ఆయన పై ఎనలేని గౌరవాభిమానాలు చూపుతూ, ఆయనను పొగడ్తలలో ముంచెత్తినారు. అయినా యూసుఫ్ అలైహిస్సలాం జవాబు ఇవ్వటంలో తొందరపాటు చూపనూ లేదు, వారిని సంతోషపెట్టే విధంగా వాటి భావాన్ని వివరించనూ లేదు, వారి దృష్టిలో తన కీర్తి ప్రతిష్టలను మరింతగా పెంచుకోవటానికి ప్రయత్నించనూ లేదు, వారిని సంతోషపెట్టి స్వయంగా లాభం పొందటానికి ప్రయత్నించనూ లేదు.

అయితే యూసుఫ్ అలైహిస్సలాం వారిద్దరినీ అల్లాహ్ మార్గం వైపు పిలవటానికి ఆ ఘడియను సరైన పద్ధతిలో అత్యంత వివేకంతో ఉపయోగించినారు. ఆ కలను వివరించే సంభాషణ మొదలు పెట్టినప్పుడు

ఆయన సత్యధర్మ ప్రచార విధానాన్ని అవలంబించినారు. తన యొక్క అసలు లక్ష్యమైన తౌహీద్ అంటే ఏకదైవారాధన వైపునకు వారిని ఆహ్వానించినారు. వారి పలుకులు అల్లాహ్ యొక్క సత్యధర్మం పై స్పష్టంగా సాక్ష్యాన్నిస్తున్నాయి. ఆయన అవలంబించిన ఆ ధర్మప్రచార విధానం క్రింది రెండు విషయాలను ఋజువు చేస్తున్నది.

1) వ్యవసాయదారుడు సరైన వాతావరణం కోసం వెతుకుతున్నట్లుగా, నిరీక్షిస్తున్నట్లుగా, ధర్మప్రచారకుడు కూడా తగిన సమయాన్ని, సందర్భాన్ని వెతుకుతూ, నిరీక్షించవలెను.

2) ఎప్పుడైతే అల్లాహ్ ధర్మప్రచారం కోసం సువర్ణావకాశాన్ని ధర్మప్రచారకుడికి ప్రసాదిస్తాడో, ఆ శుభమైన క్షణాలను వ్యర్థం చేయటమూ, తొందరపాటులో సరిగ్గా వినియోగించుకోకపోవటమూ అతనికి తగదు. అయితే మంచి తెలివితేటలతో, వివేకంతో దానిని అందరి శుభం కోసం సద్వినియోగం చేయవలెను.

| 45 నిమిషాలు | అల్ వలా – అల్ బరా<br>ధర్మప్రచారకుడి ఇష్టాయిష్టాలు | 12వ వారం |
|---|---|---|

## ఎనిమిదవ నియమం:

ఎదుటి వ్యక్తి తనతో పోట్లాడే విధానాన్ని అవలంబిస్తున్నాడనే లేదా శత్రుత్వ భావాలతో ప్రవర్తిస్తున్నాడనే విషయాన్ని ధర్మప్రచారకుడు గ్రహించగానే, అతనిలోని ఆ వ్యతిరేక భావాలను తొలగించటానికి గట్టిగా ప్రయత్నించ

వలెను. సత్యధర్మం పై అతని కోపాన్ని తగ్గించటానికి, అతని తిరస్కారభావాన్ని రూపుమాపటానికి సాయశక్తులా ప్రయత్నించవలెను. ఇంకా సత్యధర్మాన్ని మృదుమధురమైన మెత్తటి, తియ్యటి పలుకులతో అసత్యధర్మపు అన్ని ద్వారాలు మూసుకునే విధంగా అతనికి చేరవేయవలెను. శుభమార్గాలన్నీ అతనికోసం తెరుచుకునే విధంగా చిత్తశుద్ధితో అల్లాహ్ వైపు పిలుస్తూ, సత్యధర్మం నుండి దూరమై పోకుండా చూడవలెను. ఎదుటి వ్యక్తి కోపంలో, తప్పుడు మార్గాన్ని ఎన్నుకోవటం వలన నిజానిజాల, సత్యాసత్యాల మధ్య భేదాన్ని గుర్తించే బుద్ధీజ్ఞానాన్ని, వివేకాన్ని కోల్పోవును. దివ్యఖుర్ఆన్ ఈ పరిస్థితిని ఇబ్రాహీం

అలైహిస్సలాంకు మరియు తనే దేవుడని విర్రవీగుతున్న అక్కడి రాజుకు మధ్య జరిగిన సంభాషణను  చాలా స్పష్టంగా ఇలా తెలియజేసెను (అల్ బఖరా 258) –

**"ఇబ్రాహీము ప్రభువు ఎవరు అనే విషయం పై అతనితో వివాదపడిన వ్యక్తి విషయాన్ని గురించి నీవు ఆలోచించలేదా ? అల్లాహ్ ఆ వ్యక్తికి రాజ్యాధికారాన్ని ఇవ్వటం వలన ఈ వివాదం తలెత్తింది. 'జీవన్మరణాలు ఎవరి అధీనంలో ఉన్నాయో, ఆయనే నా ప్రభువు' అని ఇబ్రాహీం ప్రకటించినప్పుడు అతడు ఇలా జవాబు పలికినాడు 'చావు బ్రతుకులు రెండూ నా అధీనంలోనే ఉన్నాయి' ఇబ్రాహీము ఇలా అన్నాడు 'సరే, అల్లాహ్ సూర్యుణ్ణి తూర్పు నుండి ఉదయింపజేస్తాడు. నీవు కాస్త దానిని**

**పడమర నుండి ఉపయింపజేయ్యి.' ఇది విన్న ఆ సత్యధిక్కారి బిత్తరపోయాడు. అయితే అల్లాహ్ దుష్టులకు ఋజుమార్గం చూపడు."**

దీనిని వివరిస్తూ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపినారు – ఇబ్రాహీం అలైహిస్సలాం ఆ రాజు యొక్క అసందర్భపు వాదనలతో ఏమాత్రం బెదరకుండా, అతనిని ధైర్యసాహసాలతో ఎదుర్కొనెను. ఇబ్రాహీం అలైహిస్సలాం రెండో ప్రశ్న అడిగినప్పుడు జవాబు కోసం రాజును నిలదీసే హక్కు ఆయనకు ఉన్నప్పటికీ, అతనితో అలా వ్యవహరించక వివేకవంతమైన పద్ధతిని అవలంబించెను. ధర్మప్రచారపు ఈ విధానాన్ని ఖుర్ఆన్ ఇలా విరిస్తున్నది (అన్నహల్ 125) – **"ప్రవక్తా! వివేకంతో, చక్కని హితబోధతో, ప్రజలతో ఉత్తమోత్తమమైన రీతిలో వాదించు మరియు నీ**

**ప్రభువు మార్గం వైపునకు ఆహ్వానించు"** కాబట్టి ఇబ్రాహీం అలైహిస్సలాం ఆ నమ్రూద్ రాజు యొక్క దురాలోచనలను పసిగట్టి, అర్థంపర్థంలేని అతని

వాదనలను పొడిగించకుండా, మానవ పరిధిని జ్ఞాపకం చేసే విధంగా చక్కని వివేకంతో సంభాషించెను.

## ధర్మప్రచారకుడు తనదైన ప్రత్యేక స్థాయిని, పద్ధతిని ఎన్నుకున్నవాడై ఉండును.

తనకు ప్రసాదింపబడిన శక్తిసామర్థ్యాల మేరకు అల్లాహ్ వైపు ఆహ్వానించే బాధ్యత ప్రతి ముస్లింపై ఉన్నది. ఈ విషయాన్ని దివ్యఖుర్ఆన్

ఇలా ప్రకటిస్తున్నది (అత్తౌబా 71) - **“విశ్వాసులైన పురుషులూ, విశ్వాసులైన స్త్రీలూ – వారందరూ ఒకరికొకరు సహచరులు, వారు మేలు చెయ్యండి అని ఆజ్ఞాపిస్తారు. చెడు చెయ్యవద్దు అని నిరోధిస్తారు.”** ఇదే విషయమై ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బోధించారు – “మీలో ఎవరైనా ఇస్లామీయ ధర్మశాసనంలో తెలుపబడిన చెడు లేక పాపపు పని జరుగటం చూసినట్లయితే, దానిని అతను తన చేతితో ఆపటానికి ప్రయత్నించ వలెను.

ఒకవేళ అలా చేసే శక్తిసామర్థ్యం లేకపోతే నోటితో దానిని ఆపవలెను. ఒకవేళ అలా కూడా చేసే శక్తసామర్థ్యం లేకపోయినట్లయితే, కనీసం తన మనస్సులో నైనా దానిని చెడుగా, పాపపు పనిగా భావించవలెను, కాని అలా చేయటం (మూడోపని) విశ్వాసంలోని చిట్టచివరి స్థాయి.” కాబట్టి

అటువంటి అత్యున్నతమైన, తప్పనిసరైన సత్యధర్మప్రచార బాధ్యతా ద్వారపు రెండు తలుపులనూ మేము మీ కోసం తెరుస్తున్నాము. ఎవరైతే ఈ పిలుపును స్వీకరిస్తారో, వారికి మేము ఖుర్ఆన్ మరియు సున్నహ్ ల

ఆధారంగా తయారు చేయబడిన అత్యుత్తమమైన, ప్రామాణిక ఇస్లామీయ విద్యను అందిస్తాము. ఇంకా ఇస్లామీయ ధర్మప్రచారపు వివిధ పద్ధతులు, మెళుకువలు వారికి బోధించి, వారిని శక్తివంతమైన, వివేకవంతమైన ప్రచారకులుగా తయారు చేయటానికి ప్రయత్నిస్తాము. ధర్మప్రచారం యొక్క బాధ్యత ఎలాగైతే అల్లాహ యొక్క ప్రవక్తల, సందేశహరుల, వారి సహచరులపై ఉండినదో, అది వారి వారసత్వం కారణంగా ప్రతి సత్యధర్మప్రచారకుడిపై ఉన్నది.

అంటే ఇహపరలోకాలలో సాఫల్యం పొందాలంటే ప్రతి ముస్లిం ఒక సత్యధర్మప్రచారకుడి బాధ్యతను చిత్తశుద్ధితో, తన శక్తిసామర్థ్యాల మేరకు నెరవర్తించ వలసి ఉన్నది. నిశ్చయంగా, అల్లాహ్ తన ధర్మప్రచారం కోసం అత్యుత్తమమైన మహోన్నతుడిని ఎన్నుకొనెను. ఆయన యొక్క సహచర వర్గానికి అత్యున్నతమమైన సమాజపు దీవెనలు, శుభాలు ప్రసాదించెను. ఇంకా ప్రతికాలంలోను ఒక సమాజానికి ఇతరులకు లభ్యం కాని ధర్మవిద్యను, దానిని గ్రహించే తెలివితేటల్ని, అర్థం చేసుకునే వివేకాన్ని, చిత్తశుద్ధితో ఆచరించే ధైర్యసాహసాలను, మంచిచెడులను మరియు పాపపుణ్యాలను వేరుపర్చే సంపూర్ణ జ్ఞానాన్ని ప్రసాదించెను. ఆ సమాజమే సత్యధర్మప్రచారకులది. అల్లాహ్ వారిని తన ధర్మవిద్యకు వారసులుగా చేసెను.

కాబట్టి ఎవరైతే ఇస్లామీయ ధర్మవిద్యను అభ్యసిస్తున్నారో, వారు అల్లాహ్ కు దగ్గరయ్యే సత్యధర్మమార్గంలో ప్రయాణిస్తున్నట్లే. అటువంటి మహోన్నతమైన ఆ సత్యధర్మప్రచార సమాజానికి ఇంకే సహాయ సహకారాల అవసరం లేదు. వారి యొక్క సత్శీలత, ఉన్నత స్వభావం,

ఖుర్ఆన్ మరియు సున్నహ్ ల ఆధారాలతో నేర్చుకున్న ప్రామాణిక విద్య మొదలైనవాటి సహాయంతో వారు సత్యధర్మప్రచారపు బాధ్యతలను సరిగ్గా నెరవేర్చుతారు మరియు ఇతరులు స్వీకరించేటంతటి స్థాయికి తమ ధర్మప్రచారాన్ని చేర్చేందుకు గట్టిగా కృషిచేస్తారు. వారి ధర్మ ప్రచారం ప్రభావవంతమైనదిగా ఉండేటట్లు ప్రయత్నిస్తారు. తమ యొక్క ప్రతి ఖరీదైన, విలువైన వస్తువు సత్యధర్మప్రచారం కోసం లేక ఆ ఉన్నత మార్గంకోసం అవసరమైనప్పుడు సమర్పించటానికి తయారుగా ఉంటారు. అల్లాహ్ ఎల్లప్పుడూ, తన ధర్మప్రచారం కోసం ప్రజలలోని ఉత్తమమైన వారినే ఎన్నుకొనెను. ఆ బరువు బాధ్యతలను భరించేటందుకు వీలుగా, వారికి ఉత్తమమైన సత్యశీలతను, స్వభావాన్ని, గుణగణాలను, జ్ఞానాన్ని, వివేకాన్ని, ధైర్యసాహసాలను ప్రసాదించెను. వారిని మచ్చలేని వారుగా తీర్చిదిద్దెను.

| | | |
|---|---|---|
| **45 నిమిషాలు** | **ధర్మప్రచారకుడి గుణగణాలు** | **13వ వారం** |

## 1) మొదటిది - ధర్మప్రచారకుడు అల్లాహ్ తో దృఢమైన సంబంధం కలిగి ఉండవలెను,

ధర్మప్రచారకుడు తనలో అనేక శుభాలు కలిగి ఉండి, సత్యధర్మం వైపు ఆహ్వానించే వాడై ఉండును. ఏకైక ఆరాధ్యుడైన అల్లాహ్ ను ప్రజలు గుర్తించి, ఇహపరలోకాలలో సాఫల్యం పొందాలనేదే అతని యొక్క ప్రాథమిక లక్ష్యమై

ఉండును. కాబట్టి ప్రతి ధర్మప్రచారకుడు తప్పని సరిగా అల్లాహ్ తో దృఢమైన మరియు పటిష్టమైన సంబంధం కలిగి ఉండ వలెను. తనలో నుండి అల్పమైన ప్రాపంచిక విశ్వాసాలను, నమ్మకాలను పూర్తిగా

తొలగించి, అల్లాహ్ పై మరియు అల్లాహ్ యొక్క దీన్ (ధర్మం) పై సంపూర్ణ విశ్వాసాన్ని స్థాపించవలెను. దృఢమైన విశ్వాసంతో అల్లాహ్ పై ఆధారపడవలెను.

ఇంకా తనకు పూర్తిగా తెలిసిన ఇస్లామీయ ధర్మంలోని విషయాలను నిస్సంకోచంగా ఎదుటివారికి అందజేయవలెను. ఆ విధంగా సత్యధర్మప్రచారం అతని మాటల మరియు చేతల మధ్య నుండి శుభాస్సీసుల రూపంలో వేగంగా, నిలకడగా ప్రవహించును. అంతేకాక అతని ధర్మప్రచారంలో అల్లాహ్ యొక్క దీవెనలు కూడా చేరి, అతని ప్రయత్నాలు సులభమై పోవును.

**<u>అల్లాహ్ తో దృఢమైన మరియు పటిష్టమైన సంబంధం కలిగి ఉండటం అంటే:</u>**

- ఇస్లామీయ విధులను ఎప్పుడూ జ్ఞాపకం ఉంచుకోవటం, వాటిని ఇస్లామీయ ధర్మాదేశాల కనుగుణంగా ఆచరిస్తూ ఉండటం, వాటి నియమనిబంధనల, షరతుల గురించి పూర్తిగా తెలుసుకోవటం....

- పట్టువిడవకుండా గట్టిగా ప్రయత్నించటం. ఇస్లాంలోని శుభకార్యాలు, పుణ్యాకార్యాలు, దానధర్మాలు వంటి మంచి పనులు చేయటానికి మనస్సును తయారుచేయటం మరియు వాటికి అలవాటు చేయటం.

ఇంకా అదనపు నఫిల్ నమాజులను మనస్ఫూర్తిగా ఆచరించటం, ప్రత్యేకంగా రాత్రివేళల్లో తహజ్జుద్ నమాజు (ఖయాముల్లైల్) చేయటం,

వీలున్నప్పుడల్లా అల్లాహ్ యొక్క ధ్యానం చేయటం, ప్రతి సోమ మరియు గురువారాలలో, అయ్యామ్ బైద అంటే ప్రతి హిజ్రీ నెలలోని 13, 14, 15వ తేదీలలో ఉపవాసం ఉండటం, అల్లాహ్ మార్గంలో అధికంగా దానధర్మాలు చేయటం మొదలైన వాటిని మనస్ఫూర్తిగా ఆచరించటం. ఇవి అతనిలో అల్లాహ్ యొక్క విశ్వాసాన్ని నింపును. అల్లాహ్ యొక్క ధర్మాజ్ఞలపై, ధర్మాదేశాలపై సంపూర్ణ విశ్వాసం కలిగి ఉండవలెను. అతని యొక్క నిస్వార్థమైన పుణ్యకార్యాలు, మంచిపనులు ధర్మప్రచార మార్గంలో అసమానమైన సహాయసహకారాలందించును. ఈ విషయాన్ని మూసా మరియు హారూన్ అలైహిస్సలాంలకు అల్లాహ్ చేసిన ఉపదేశం దివ్యఖుర్ఆన్ ద్వారా ఇలా తెలుపబడినది. **"మరియు మీరిద్దరూ నా ధ్యానంలో అశ్రద్ధ చేయవద్దు"** తాహా 20 : 42

ఖుర్ఆన్ లో మరికొన్ని చోట్ల అల్లాహ్ ఇలా ప్రకటించెను - **"మీరునా ధ్యానం చేయండి, నేను కూడా మిమ్మల్ని జ్ఞాపకం చేస్తాను"** అల్ బఖరా 2:152

**"నిలబడి, కూర్చుని, ప్రక్కకు తిరిగి పడుకుని అల్లాహ్ యొక్క ధ్యానం చేస్తూ, భూమ్యాకాశాల సృష్టి పై దృష్టి సారిస్తూ, ఇలా వేడుకుంటూ ఉంటారు – 'ఓ నా ప్రభూ! నీవు వీటిని ప్రయోజనం లేకుండా**

**సృష్టించలేదు, నీవు పరిశుభ్రుడవు. ఇక నీవే మమ్మల్ని నరకాగ్ని నుండి రక్షించు’” ఆలె ఇమ్రాన్ 3:191**

అంతే కాక, అంతిమ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం రాత్రివేళల్లో తన రెండు కాళ్ళూ వాచిపోయటంతటి వరకు నిలబడి తహజ్జుద్ నమాజు చేసేవారు. ఆయెషా రదియల్లాహు అన్హా ఒక హదీథ్ లో ఇలా ఉల్లేఖించినారు – తన రెండు కాళ్ళు వాచిపోయి, స్థంభాల వలే మారిపోయే వరకు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం రాత్రి వేళల్లో నిలబడి తహజ్జుద్ నమాజు చేసేవారు. అది చూసి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఆవిడ ఇలా ప్రశ్నించేవారు – “ఓ రసూలుల్లాహ్! మీ భూతభవిష్య తప్పులను అల్లాహ్ క్షమించి వేసినా కూడా, ఎందుకు మీరు ఇంత ఎక్కువసేపు నమాజులో నిలబడుతున్నారు?” దానికి జవాబుగా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా పలికినారు – “అల్లాహ్ నా పై అంత అధికంగా దయాదాక్షిణ్యాలు, కరుణాకటాక్షాలు చూపుతున్నప్పుడు, నేను ఆయనకు సాధ్యమైనంత ఎక్కువగా కృతజ్ఞతలు తెలుపుకోకూడదా!”

అబూ హురైరా రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఇంకో హదీథ్ లో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపినారు – “అల్లాహ్
పై శపథం చేసి చెబుతున్నాను. ప్రతి దినం నేను 70 సార్ల కంటే ఎక్కువగా పశ్చాత్తాప పడుతూ ఉంటాను, అల్లాహ్ యొక్క క్షమాపణ వేడుకుంటూ ఉంటాను.”

కాబట్టి ప్రతి ధర్మప్రచారకుడు ఇటువంటి ఉత్తమమైన జీవనవిధానాన్ని అలవర్చుకోవలెను. ఎల్లప్పుడూ అల్లాహ్ యొక్క ధ్యానం చేస్తుండవలెను. అల్లాహ్ కు మరియు అల్లాహ్ యొక్క ధర్మప్రచారానికి దూరం చేసే ప్రతి విషయం నుండి దూరంగా ఉండవలెను, వాటి ప్రభావానికి లోను కాకుండా చూసుకోవలెను. అల్లాహ్ తనకు ప్రసాదించిన ధనసంపదలనే వాడుకోవలెను. అల్లాహ్ యొక్క కఠిన శిక్షల గురించి భయపడుతూ ఉండవలెను. సంరక్షణకు, భద్రతకు అల్లాహ్ నే వేడుకోవలెను. తన ప్రార్థనలను అల్లాహ్ కే ప్రత్యేకించవలెను.

ప్రవక్తలూ మరియు ఉత్తమ పురుషులూ ఆ మార్గం పైనే నిలకడగా ప్రయాణించినారు. వారు తమకు ఏవైనా కష్టనష్టాలు ఎదురైనప్పుడు నమాజుల, ప్రార్థనల, చిత్తశుద్ధితో కూడిన పశ్చాత్తాపముల వైపునకు మళ్ళేవారు. కేవలం అల్లాహ్ యొక్క సహాయ సహకారాలను, తోడ్పాటునే గట్టిగా పట్టుకోవటం వలన, తమకు ఎదురైన ఆపదలు త్వరత్వరగా వీడిపోయేవి.

**అల్లాహ్ తో దృఢమైన మరియు పటిష్టమైన సంబంధం కలిగి ఉండటం వలన కలిగే లాభాలు:**

మొదటి లాభం ధర్మప్రచారకుడి ఈమాన్ అంటే విశ్వాసం దృఢమగును, పటిష్టమగును, గట్టిపడును. కారులోని స్పీడోమీటర్ వలే మనిషి లోపల ఈమాన్ పనిచేయును. కారు వేగాన్ని ఎలాగైతే స్పీడోమీటరు సూచిస్తుందో, మనలోని ఈమాన్ (విశ్వాసం) కూడా సరిగ్గా అలానే

పనిచేస్తుంది. అది మనం అల్లాహ్ కు చూపుతున్న విధేయత, సమర్పణ, ఆరాధనల ఆచరణ మొదలైనవి ఎలా అధికమవుతూ ఉంటాయో, ఆ విధంగా మన ఈమాన్ (విశ్వాసం) కూడా బలపడటం, దృఢమవటం, మనస్సు విధేయతలో నిమగ్నమైపోవటం వంటి స్థితి పెరిగిపోతూ ఉంటుంది.

దీనికి విరుద్ధంగా ఎప్పుడైతే పుణ్యకార్యాల, మంచి పనుల ఆచరణలు తగ్గిపోతూ ఉంటాయో, మనస్సు బలహీనంగా, అల్పమైనదిగా, ఢీలా పడిపోతూ, సోమరితనం పెరిగిపోతూ, బద్ధకించటం మొదలు పెడుతుంది. ఆ విధంగా అది ఉత్తమమైన స్థితి నుండి క్రిందికి దిగజారి, నీచస్థితికి చేరుకుంటుంది. దీని గురించి ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు – **"ఎప్పుడైతే అల్లాహ్ యొక్క ఆయత్ లు (వచనాలు) వారికి చదివి వినిపించబడునో, ఆ ఆయత్ లు వారి ఈమాన్ ను పెంచును."** (అన్ ఫాల్, 2)
**"అది ఆయనే, ఎవరైతే ముస్లింల హృదయాలలో శాంతి, ప్రశాంతతను నింపెనో, ఎందుకంటే తమలో ముందు నుండి ఉన్న ఈమాన్ తోపాటు దానిని ఇంకా వృద్ధి చేసుకోవటానికి."** - (అల్ ఫతహ్ 4)

## 2) రెండవది–ధర్మప్రచారకుడు ముందుగా తనను తాను సరిదిద్దుకోవటానికి ప్రయత్నించవలెను:

మీరు ముందుగా తమ ఆత్మను, మనస్సును, హృదయాన్ని పరిశుద్ధ పరచుకోవటంతో ధర్మప్రచారాన్ని మొదలు పెట్టలెను. సరైన ఒక సత్యధర్మప్రచారకుడి గుర్తింపు ఇదే. ఇతరులను సరిదిద్దటానికి మరియు అల్లాహ్ మార్గం వైపు ఆహ్వానించటానికి పూనుకోవాలనుకున్నతను, ధర్మప్రచారపు పునాది వంటి మొట్టమొదటి పనితో దానిని

ప్రారంభించవలెను. అది ఏమిటంటే, మొట్టమొదట తనతోనే ప్రారంభించటం. అంటే తన స్వంత ఆత్మను స్వయంగా తానే సరిదిద్దుకోవటం, మంచి పనులు మరియు శుభకార్యాలతో తమ ఆచరణలకు సంబంధాన్ని దృఢపర్చడం. మనస్సును ఎల్లప్పుడూ ఆ వాగ్దానం పైనే ఖాయంగా ఉంచటం. చిత్తశుద్ధి తగ్గటం వలన షైతాను లోపలికి ప్రవేశించి, వారి శుభకార్యాలను, మంచి పనులను నిర్వీర్యం చేయను. ఇంకా అతని ధర్మప్రచారాన్ని బలహీన పరచి, క్రమంగా అంతం చేసివేయును. ఇటువంటి గంభీర పరిస్థితి నుండి, భయంకర ప్రమాదం నుండి పై పునాది ధర్మప్రచారకుడిని కాపాడును.

కాబట్టి ధర్మప్రచారకుడు ముందుగా తనను తానే సరిదిద్దుకుని, తన మనస్సును మంచి పనులపై నిమగ్నం చేయటానికి ప్రయత్నించవలెను. ప్రజలు ధర్మప్రచారకుడిని కేవలం తమ దృష్టితో చూడటంతోనే ఆగకుండా, తమ ఇతర ఇంద్రియ స్పర్శలన్నింటితో పరిశీలిస్తుంటారు. అంతే కాక ఎల్లప్పుడు వారిలోని చిన్నాపెద్ద తప్పులను, పాపపు పనులను

పట్టుకునేందుకు రాత్రిపగలు ప్రయత్నిస్తుంటారు. ప్రతి యుగంలోను, ప్రతిచోట ప్రజలు తమపై ధర్మప్రచాకుడికి ఉన్న హక్కు కంటే ఎన్నోరెట్లు తమకు ధర్మప్రచారకుడి పై హక్కు ఉన్నదని భావిస్తుంటారు. అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు - **“అల్లాహ్ యొక్క ఒక సంప్రదాయం ఏమిటంటే, మీరు అల్లాహ్ యొక్క సంప్రదాయములలో ఏ మార్పునూ చూడలేరు.”** (అల్ ఫతహ్ 23)

కాబట్టి, ధర్మప్రచారకుడు తన మనస్సు ఏమాత్రం మారుతుందని అంటే లోభత్వం (బఖీల్) తనలో ప్రవేశిస్తుందని గ్రహించినా, వెంటనే దానికి సరైన వైద్యం చేయవలెను. దీని ద్వారా అతడు ప్రజలలో దుష్టుడు అంటే లోభి అనే మారుపేరు పొందకుండా కాపాడుకోవచ్చును.

ఒకవేళ ధర్మప్రచారకుడు తన మనస్సును అదుపులో పెట్టకుండా దాని తప్పులను చూసీచూడనట్లు అశ్రద్ధ చేస్తూ, దాని దారికి దానిని వదిలివేసి, దానికి సరైన వైద్యం చేయనట్లయితే, అతడు ఇతరుల చెడుపనులకు, పాపకార్యాలకు ఎలా ధర్మవైదాన్ని చేయగలడు? దీని కారణంగా ప్రవక్తలు తమ తమ పనులలో, ఆచరణలలో తమ మనస్సులపై, ఆత్మలపై చాలా తీవ్రమైన, పటిష్టమైన అదుపు ఉంచేవారు. సాధుస్వభావానికి పూర్తిగా దాసోహమనేవారు. ఇంకా తమ దగ్గరి సహచరులకు, కుటుంబసభ్యులకు ధర్మబోధన చేస్తూ, వారిని కూడా సరైన దారిలో తీర్చిదిద్దటానికి ప్రత్యేకంగా కృషి చేసేవారు. దీని గురించి ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు – **“నీ కుటుంబ సభ్యులను నమాజు చెయ్యండి అని ఆజ్ఞాపించు. స్వయంగా నీవు కూడా దానిని పాటించు.”** తాహా 132

| 45 నిమిషాలు | ధర్మప్రచారకుడి గుణగణాలు | 14వ వారం |
|---|---|---|

## 3) మూడవది – జ్ఞానం కలిగి ఉండటం.

ఈ లక్షణం ధర్మప్రచారకుడి అన్ని లక్షణాలలో కెల్లా అత్యంత ప్రాధాన్యమైనది. ఎందుకంటే అది ధర్మప్రచారకుడి అన్ని విద్యలలో ముఖ్యమైనది. కాబట్టి ధర్మప్రచారకుడు తనలోని సరైన జ్ఞానపు వెలుగులోనే ధర్మప్రచారాన్ని కొనసాగించవలెను. అందుకని ధర్మప్రచారకుడి వద్ద సరైన ప్రామాణిక జ్ఞానం తప్పక ఉండవలెను. మంచి జ్ఞాపక శక్తి మరియు గ్రహణశక్తి అతని దగ్గర ఉండవలెను. ధర్మప్రచారాన్ని కొనసాగించటానికి అల్లాహ్ పై ఉన్న పటిష్టమైన విశ్వాసంతో పాటు అతనికున్న ప్రత్యేక నైపుణ్యాలు కూడా బాగా ఉపయోగపడును.

దీనికి అవసరమైన మార్గదర్శకత్వం ఖుర్ఆన్ మరియు హదీథ్ లలో లభించును. అలా ఒక ధర్మప్రచారకుడు తన విశ్వాసాన్ని, నైపుణ్యాలను జోడించి ఆత్మస్థైర్యంతో అల్లాహ్ యొక్క మార్గం వైపునకు ఆహ్వానించటానికి తన శాయశక్తులా ప్రయత్నించగలడు. ఈ విషయం గురించి ఖుర్ఆన్ ఇలా ప్రకటిస్తున్నది - **“(ప్రవక్తా!) ప్రకటించు – జ్ఞానులు, అజ్ఞానులు సమానులు కాగలరా?”** అజ్జుమర్ :9 **“మీలో నుండి విశ్వాసుల మరియు జ్ఞానుల స్థితిని ఉన్నత పరుచును.”** ముజాదిలహ్ : 11

బుఖారీ గ్రంథంలోని ఒక హదీథ్ లో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బోధించినారు “ఓ ప్రజలారా! జ్ఞానం కలిగి ఉండటమనేది జ్ఞానం

నేర్చుకోవటంలో ఉన్నది. గ్రహణశక్తి కలిగి ఉండటమనేది గ్రహించటం నేర్చుకోవటంలో ఉన్నది. ఎవరికైనా అల్లాహ్ మేలు, మంచి చేయాలని తలిస్తే, అతనికి దీన్ (ధర్మం) యొక్క జ్ఞానాన్ని ప్రసాదించును. అల్లాహ్ యొక్క దాసులలో ధర్మజ్ఞానం ఉన్నవారే అల్లాహ్ కు భయపడతారు."

## 4) కేవలం అల్లాహ్ కోసమే పనిచేసే చిత్తశుద్ధి కలిగి ఉండటం

చిత్తశుద్ధి ప్రతి విషయం యొక్క అతి ముఖ్యమైన, ప్రధానమైన అంశం. ఇది లేకుండా ఏ విషయమైనా, ఏ ఆరాధన అయినా వ్యర్థమైపోతుంది, దారి తప్పిపోతుంది. చిత్తశుద్ధి మరియు ఈమాన్ (విశ్వాసం) ఎటువంటివి అంటే అవి తమ యజమానులను గోతుల నుండి, ప్రమాదాల నుండి, తప్పుడు మార్గాల నుండి తప్పించి, ఉన్నత శిఖరాలకు చేర్చును. మరియు వారి దిశను పూర్తిగా అల్లాహ్ వైపునకు త్రిప్పివేయును. దాని వలన వారు తమ యొక్క ప్రతి ఆచరణను కేవలం అల్లాహ్ కోసమే చేయటానికి ప్రయత్నింస్తారు. ఈ విషయం దివ్యఖుర్ఆన్ లోని అల్లాహ్ యొక్క ఈ ప్రకటనలో స్పష్టమవుతున్నది - **కేవలం అల్లాహ్ నే ఆరాధించమని మరియు ధర్మాన్ని పవిత్రంగా, స్వచ్ఛంగా ఇబ్రాహీం యొక్క దీనె హనీఫా పైనే ఉంచమనే ఆజ్ఞలు తప్ప వారికి ఇంకే ఆజ్ఞలు ఇవ్వబడలేదు.** బయ్యినహ్ 5.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హదీథ్ లో ఇలా ఉపదేశింపబడినది – గ్రహించండి! ఆచరణలన్నింటి యొక్క ప్రతిఫలం సంకల్పాలపై ఆధారపడి ఉండును. ప్రతి ఒక్కరికీ అదే లభించును దేనినైతే అతను సంకల్పించుకొనెనో.

## 5) ఆదర్శవంతుడి అలవాట్లు కలిగి ఉండటం

ఈ లక్షణం మరియు ధర్మప్రచారకుడు తన ఆత్మను, మనస్సును, పరిస్థితి సరిదిద్దుకోవటం అనేది ఒకే నాణపు రెండు ప్రక్కల వంటిది. ఎప్పుడైతే ధర్మప్రచారకుడు తనను తాను మరియు తన పరిస్థితులను సరిదిద్దుకుంటాడో, అప్పుడు అతను తన మాటలతో, పలుకులతో ఇతరులను ఆహ్వానించే ముందు తన ఆచరణలను స్వయంగా సరిదిద్దుకొనును. ఇమాం రాజీ రహ్మతుల్లాహి అలైహి ఇలా తెలిపినారు – ధర్మప్రచారకుడు స్వయంగా ఆదర్శవంతుడై ఉండును. ఇది రెండు విధములు

అ) ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు – **"నిశ్చయంగా మీ కొరకు రసూలుల్లాహ్ లో (అల్లాహ్ యొక్క ప్రవక్తలో) ఉన్నతమైన ఆదర్శం, నమూనా ఉన్నది. అది అల్లాహ్ మరియు ప్రళయదినం పై విశ్వాసం ఉంచే ప్రతి ఒక్కరి కోసం."** అహ్ జాబ్ 21

ఆ) అవిశ్వాసులు ప్రవక్తలకు బదులు పలికినప్పుడు, వారు తౌహీద్ మరియు అల్లాహ్ యొక్క ఏకైక ఆరాధ్యత్వం వైపునకు ఆహ్వానించేవారు. **"ఖచ్చితంగా వారిలా అనేవారు – మేము మా తండ్రితాతలను ఒకే ధర్మంపై**

**చూసాము. మేము కూడా వారి అడుగుజాడలలోనే నడుస్తూ సాఫల్యం పొందుతాము."** జుఖ్రుఫ్ 22

## 6) మంచి ప్రవర్తనతో, మృదుస్వభావంతో మెలగటం

ప్రజలు గంభీరంగా, కఠినంగా, చండశాసనుడి లాగా ఉండేవారిని ఇష్టపడరు. అటువంటి వారిని అసహ్యించుకుంటారు. వారి నుండి దూరంగా పారిపోతుంటారు. ఈ పరిస్థితి గురించి అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు – **"అల్లాహ్ యొక్క దయ వలన మీరు వారితో మెత్తగా, మృదువుగా ప్రవర్తిస్తున్నారు. మరియు మీరే గనుక కఠినంగా మాట్లాడేవారు, కఠినంగా ప్రవర్తించేవారు అయి ఉన్నట్లయితే, అందరూ మిమ్మల్ని వదిలి వెళ్ళిపోయేవారు. కాబట్టి మీరు వారితో మెత్తగా, మృదువుగా ప్రవర్తించండి. వారి కోసం క్షమాపణ అర్థించండి. వివిధ పనుల కోసం వారిని సంప్రదించండి."** ఆలె ఇమ్రాన్ 159.

ధర్మప్రచారకుడి ధర్మప్రచారం ప్రజలను వేరు పర్చటానికి, వైరధ్యాలు పెంచటానికీ కాదు, వారితో పోట్లాడటానికి, వాదులాడటానికీ కాదు. కాని అతను వారిని సరైన సత్యధర్మమార్గంలోనికి తీసుకురావటానికి వీలున్న ప్రతి పద్ధతిని, విధానాన్ని, అవకాశాన్ని వినియోగించును. ధర్మప్రచారకుడి విధానం గురించి అల్లాహ్ ఈ క్రింది ఆయత్ లో ఇలా ప్రకటిస్తున్నాడు – **"చెడును మంచితో దూరం చేయండి. దీని వలన మీతో బద్ధశత్రుత్వం పెట్టుకున్నవాడు కూడా ప్రాణస్నేహితుడై పోవును. "** ఫుశ్శిలత్ – 34.

అనస్ రదియలల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించినారు – నేను ఒకసారి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంతో పాటు నడుస్తున్నాను. ఆ సమయంలో ఆయన లావుపాటి అంచులున్న నజరాన్ దుప్పటి కప్పుకుని ఉన్నారు. దారిలో ఒక పల్లెటూరి మనిషి ఆయన వద్దకు వచ్చినాడు. ఆయన కప్పుకున్న దుప్పటిని గట్టిగా గుంజటం మొదలు పెట్టెను. ఆ

తర్వాత నేను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మెడవైపు చూడగా, దానిపై దుప్పటి గట్టిగా గుంజటం వలన లోతైన గుర్తులు పడటం కనబడినది.

అది ఎంత తీవ్రంగా ఉందంటే, చర్మం కూడా ఒరుసుకు పోయినది. (ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అతనితో ఏమీ అనలేదు) అప్పుడు అతను ఆయనతో ఇలా పలికెను ఓ ముహమ్మద్! అల్లాహ్ మీకు ప్రసాదించిన ధనం నుండి నాకు కూడా ఇవ్వమని ఆజ్ఞాపించండి. అది విని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అతని వైపు చిరునవ్వుతో చూసినారు. ఆ తర్వాత అతనికి దానం చేయమని ఆజ్ఞాపించినారు.

## 7) తోడ్పాటునివ్వటం మరియు సులభతరం చేయటం

ధర్మప్రచారాన్ని ప్రజలలో తీసుకుపోయే ఉత్తమగుణాలలో ముఖ్యమైనది ఏమిటంటే ధర్మప్రచారకులు తమ జ్ఞానాన్ని ప్రజలు సులభంగా అర్థం చేసుకునే విధంగా వారికి చేర్చటం. అంతేగాని, కష్టమైన పద్ధతిలో కాదు. ఎందుకంటే ప్రజలు వేర్వేరు స్వభావాలు, అలవాట్లు కలిగి

ఉంటారు. వారందరికీ తేలికగా, సులభంగా అర్థం అయ్యే విధంగా ధర్మప్రచారాన్ని కొనసాగించటంలోనే దాని సాఫల్యం ఉన్నది

ఏదైనా విషయాన్ని ఒకరు ఇష్టపడవచ్చు, వేరొకరు ఇష్టపడక పోవచ్చు, అసందర్భమైనది అని భావించవచ్చు. ఎవరైతే ఇష్టపడతారో, వారు దానిని ఆచరించటానికి మనస్ఫూర్తిగా, శాయశక్తులా ప్రయత్నించటానికి అవకాశం ఉన్నది. కాబట్టి సందర్భాలోచితంగా, సమయానుకూలంగా ఒక ధర్మప్రచారకుడు తన సత్యధర్మాన్ని వారి ముందుకు తీసుకవెళ్ళవలసి ఉన్నది. అన్నింటికంటే చెడు విషయం, బాధాకరమైన విషయం ఏమిటంటే అది ప్రస్తుత ప్రపంచ పరిస్థితులలో ధర్మప్రచారకులు ప్రతి విషయంలోను కఠినంగా ప్రవర్తించటం. ఒక్కోసారి వీరిని చూస్తే ఇస్లాంలో సులభతరమనేదే లేదా? అనే ప్రశ్న కలగ వచ్చును.

ఇంకా వీరు ప్రజల స్థాయిని, హోదాలను సరిగ్గా గౌరవించరు. ఇంకా సంభాషణలో వీరు ఏది విధియైనది అంటే తప్పని సరియైనది (ఫర్ద్), ఏది

ఐచ్ఛికమైనది (నఫిల్), ఏది నిషేధింపబడినది (హరాం), ఏది అయిష్టమైనది (మక్రూహ్) అనే వివరములను స్పష్టంగా తెలుపరు. ఇంకా ఏదైనా విషయంలోని నియమ నిబంధనలు ఖుర్ఆన్ & సున్నహ్ ల నుండి నిర్ణయించబడినవా లేక ఇస్లామీయ పండితుల ఏకాభిప్రాయం (ఇజ్తెహాద్) ద్వారానా అనేది కూడా వివరించరు. ప్రజలకు విన్నపాలు చేయటానికి బదులు ఆదేశాలిస్తుండటం తరచుగా కనబడుతుంది. ఈ విధంగా వారు ఇస్లాం యొక్క గొప్పతనాన్ని కించపరుస్తున్నారు. ఇంకా షరిఅహ్ (ఇస్లామీయ జీవన విధానం) యొక్క మంచితనాన్ని, ఔన్నత్యాన్ని పరిమితం చేస్తున్నారు. ప్రజలు ఇస్లాం అంటే అయిష్టపడేటట్లు చేస్తున్నారు. ఎంతో చెడ్డవైన అలాంటి పనులను వీరు సునాయాసంగా చేస్తున్నారు.

## 8) సహనం, ఓర్పు వహించటం

కష్టకాలంలో తమ మనస్సుపై నియంత్రణ ఉంచటం మరియు నాలుకపై ఆరోపణలు తీసుకురాకుండా ఉండటం మొదలైన వాటిని సహనం, ఓర్పు వహించటం అంటారు. మామూలు ప్రజలకు ఇది చాలా కఠినమైన విషయం. ధర్మప్రచారమనేది ఎంతో కఠినమైన, కష్టతరమైన భయంకర మార్గము. మంచిని ఆదేశించటం, చెడును నిరోధించటమనే ఉత్తమమైన విధిని నిర్వర్తించే ధర్మప్రచారకులు ఎదుటివారి నుండి తీవ్రమైన కష్టనష్టాలు ఎదుర్కొన వలసి రావచ్చును. ఎందుకంటే చెడు పనులు మనసారా ఇష్టపడి చేస్తూ, వాటికి అలవాటు పడిపోయిన వారిని ధర్మప్రచారకులు వాటిని ఆపమని, వదిలి వేయమని ఆదేశిస్తుంటారు.  ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు:

**"సమయం పై ఒట్టు! నిస్సందేహంగా మానవులందరూ నష్టంలో ఉన్నారు – కాని అటువంటి ప్రజలు ఎవరైతే ఈమాన్ (విశ్వాసం) కలిగిఉండి, మంచి పనులు చేస్తూ మరియు పరస్పరం సత్యం వైపునకు రమ్మని ఆహ్వానించుకుంటూ, సహనంతో జీవించమని ఉపదేశిస్తూ ఉండేవారు తప్ప."** అల్ అసర్.

ఖుర్ఆన్ లో ఇంకో చోట లుఖ్మాన్ కు అతని తండ్రి చేసిన ఉపదేశం ఇలా పేర్కొనబడినది : **"ఓ నా కుమారుడా! నీవు నమాజును స్థిర పరుచవలెను. మంచి పనులు చేయమని ఆదేశిస్తూ ఉండవలెను. చెడు పనుల నుండి నిరోధించ వలెను. నీ పై వచ్చిన కష్టాలను సహనంతో ఎదుర్కొనవలెను. నమ్ము, ఇవి ఉత్తమమైన ఉపదేశాల లోనివి."** సూరయె లుఖ్మాన్ 17

సహనం చూపటం వలన ధర్మప్రచారకుడికి రెండు విధాలుగా లాభం కలుగును.

**అ) ధర్మప్రచారం కారణంగా ఎదురయ్యే కష్టాలకు సహనం వహించటమనేది ధర్మప్రచారకుడి అత్యుత్తమ లక్షణాలలోనిది.** ధర్మప్రచారకుడు అప్పుడప్పుడు ధర్మప్రచారం చేయటంలో తొందరపాటు చూపటం తగదు. అయితే ధర్మప్రచారం కోసం తగిన సమయం కోసం, సందర్భం కోసం, అవకాశం కోసం ధర్మప్రచారకుడు వేచి చూడవలెను. అంతేకాక ఎదుటి వ్యక్తి అతని మాటలను నిశ్చింతగా, మనస్పూర్తిగా పూర్తి ధ్యాసతో వినేటట్లు మరియు దృష్టి కేంద్రీకరించేటట్లు మానసికంగా తయారు

చేయవలెను. ఇంకా ధర్మప్రచారకుడు ఎదుటి వ్యక్తి తనను ఇష్టపడేటట్లు కూడా చూసుకోవలెను.

ఈ విషయాలు ధర్మప్రచారాన్ని ఎదుటి వ్యక్తి స్వీకరించటంలో ఎంతో తోడ్పడును. కాబట్టి ధర్మప్రచారకుడు తన పనిలో తొందపాటు చూపకూడదు, ఎదుటివానితో కఠినంగా ప్రవర్తించకూడదు, తన పిలుపును స్వీకరించమని అస్సలు బలవంత పెట్టకూడదు. ఎదుటివానితో మెత్తగా,

మృదువుగా,ఆహ్లాదకరంగా ప్రవర్తించవలెను. ఇంకా ఎదుటివానికి సత్యధర్మంపై సానుకూలంగా ఆలోచించటానికి, లోతుగా పరిశీలించటానికి తగినంత సమయం ఇవ్వవలెను.

వివేకంతో, మంచిగా అల్లాహ్ మార్గం వైపు ఆహ్వానించటం మాత్రమే తన కర్తవ్యమనే విషయం ప్రతి ధర్మప్రచారకుడు తెలుసుకోవలెను. అంతేకాని ఎదుటి వ్యక్తి అతని ఆహ్వానాన్ని స్వీకరించాడా లేదా అనే దానికి ధర్మప్రచారకుడు బాధ్యత వహించడు.

ఇంకా ఎదుటి వ్యక్తి తప్పకుండా ఆహ్వానాన్ని స్వీకరించి తీరాలనే నియమం ధర్మప్రచారకుడిపై లేదు. అటువంటి బాధ్యత, నియమం ప్రవక్తలపై కూడా ఉండేది కాదు. మరి అటువంటప్పుడు అది సాధారణ ధర్మప్రచారకుడిపై ఎలా ఉంటుంది? కాబట్టి ధర్మప్రచారకుడి బాధ్యత వివేకంతో, మంచిగా అల్లాహ్ మార్గం వైపునకు ఆహ్వానించటం వరకే పరిమితం.

దీని గురించి ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు – **“రసూల్ (సందేశహరుడి) యొక్క బాధ్యత కేవలం దివ్యసందేశాన్ని అందజేయటం మాత్రమే”** సూరహ్ అన్నూర్ 54

**“(ప్రవక్తా!) నీవు ఎవరికి తోచితే వారికి మార్గదర్శకత్వం వహించలేవు. కాని కేవలం అల్లాహ్ మాత్రమే ఎవరిని తలిస్తే వారికి మార్గదర్శకత్వం వహించును. మార్గదర్శకత్వాన్ని స్వీకరించేవారి గురించి అల్లాహ్ కు బాగా తెలుసును.”** సూరహ్ అల్ ఖసస్ 56

**ఆ) ధర్మప్రచారకుడికి తన పనిలో సహనం వహించవలెను. ఇది రెండు విధాలుగా ఉన్నది.**

1) **<u>సుదీర్ఘమార్గం పై సహనం వహించటం:</u>** ధర్మప్రచార మార్గం చాలా సుదీర్ఘమైనది. కష్టమైనది మరియు అలసటతో కూడుకున్నది. ఏ సమయంలోనైతే అల్లాహ్ పై విశ్వాసం (ఈమాన్) అతనిలో ప్రవేశించినదో మరియు అతనికి ఇస్లాం ధర్మజ్ఞానాన్ని అల్లాహ్ ప్రసాదించెనో, అప్పటి నుండే ధర్మప్రచార మార్గంలోని అతని సుదీర్ఘ ప్రయాణం మొదలైపోతుంది. ఇదే విధానం పై ప్రవక్తలందరూ నడిచినారు. దానినే సల్ఫ్ఫలురు అనుసరించినారు.

ఉదాహరణకు ప్రవక్త నూహ్ అలైహిస్సలాం దాదాపు 950 సంవత్సరాల పాటు ఎడతెరపి లేకుండా అల్లాహ్ మార్గం వైపు పిలిచినారు, అల్లాహ్ తనపై అవతరింపజేసిన షరిఅహ్ వైపు ప్రజలను పిలవటానికి అల్లాహ్ ప్రసాదించిన సంపదనంతా ఖర్చు పెట్టినారు మరియు అనేక విషయాలను త్యాగం చేసినారు.

2) **ఎదురయ్యే ఇబ్బందులు, కష్టనష్టాల పై సహనం వహించటం:** ఒక్కోసారి ధర్మప్రచారకుడికి తన పనిలో కొన్ని కష్టాలు, అవమానం, ఎగతాళి, నష్టాలు ఎదురవవచ్చును. అంతేకాక కొంత బాధ మరియు పరేషానీ కూడా ఎదురవవచ్చును. ధర్మప్రచారకుడు అటువంటి పరిస్థితులలో తప్పకుండా సహనం వహించవలెను. ఒక మోమిన్ (విశ్వాసి) తన యొక్క దీన్ (ధర్మం), ఈమాన్ (విశ్వాసం) మరియు వాటిపై అతని పట్టు గట్టిపడటానికి అనేక రకాల పరీక్షల నుండి ప్రయాణించవలసి ఉన్నది.

సఆద్ బిన్ అబి వఖాస్ రదియల్లాహు అన్హు ఒక హదీథ్ లో ఇలా ఉల్లేఖించినారు – "ఒకసారి నేను ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ను ఇలా ప్రశ్నించినాను 'ఓ రసూలుల్లాహ్! ప్రజల ఎవరు అత్యంత కఠినమైన పరీక్షలను ఎదుర్కొన్నారు?' అది విని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా జవాబిచ్చినారు 'ముందుగా ప్రవక్తలు, ఆ తర్వాత సత్పురుషులు, ఆ తర్వాత ఉత్తమ ప్రజలు తమలోని ఈమాన్ (విశ్వాసం) మరియు అమల్ (ఆచరణల) యొక్క స్థితిని బట్టి.'"

## 9) ధర్మప్రచారకుడి ఉన్నత స్థానం మరియు శుభకార్యాల పై అతని ఆసక్తి

ధర్మప్రచారకుడి ఉన్నతస్థానం అతని ఆచరణలలోనే ప్రదర్శితమగును. ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు – "**మరియు అల్లాహ్ వైపు పిలుస్తూ, మంచి పనులు చేస్తూ, నిశ్చయంగా నేను ముస్లింను**

**(సమర్పించుకున్నవాడిని) అని పలికే వానికంటే ఉన్నతమైన మాటలు పలికేవారెవరుంటారు?"** (ఫుస్సిలత్ -33)

ఈ ఆయత్ (వచనం) ధర్మప్రచారకుడికి , ఇస్లాం ధర్మానికి ఉన్న సంబంధాన్ని తెలియజేస్తున్నది. అతని ఉన్నత స్థానాన్ని ప్రకటిస్తున్నది. ఇతరులపై అతనికున్న ఆధిక్యతను ఎలుగెత్తి చాటుతున్నది. ఈ యొక్క ఉన్నత స్థానం అతనికి తన దేశం, జాతి, రంగు, వంశం మొదలైన వాటి కారణంగా లభించలేదు, కాని అది అతను తనకు తానుగా దీనె హనీఫ్ అంటే ఇస్లాంకు మనసా వాచా కర్మా సమర్పించుకోవటం వలన లభించినది. దీని గురించి ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు – **"నిశ్చయంగా అల్లాహ్ దగ్గర దీనె ఇస్లాం (అంటే ఇస్లాం ధర్మం) మాత్రమే స్వీకరించబడును"** ఆలె ఇమ్రాన్ 19

## ధర్మప్రచారకుడు డిబేటు(వాక్చాతుర్య నైపుణ్యం), ఇతర ఆధునిక విద్యలను అభ్యసించటం

నిస్సందేహంగా, ధర్మప్రచారకుడు తన తెలివితేటలను సానపట్టడానికి, గ్రహణశక్తిని పెంపొందించు కోవటానికి, వాదనా పటిమను పెంచుకోవటానికి అవసరమైన నైపుణ్యాలను, విద్యలను అభ్యసించటంలో ప్రయోజనం ఉన్నది. తనలోని ప్రాపంచిన నైపుణ్యాలను అతను ధర్మప్రచారంలో కూడా వినియోగించవచ్చును. తనలో వివిధమైన నైపుణ్యాలు లేకుండా ఎదుటి వానికి ధర్మప్రచారం చేయటానికి ప్రయత్నిస్తే, వారి వాగ్ధాటి ముందు, నైపుణ్యాల ముందు అది అంతగా సాఫల్యం పొందలేక పోవచ్చును. అతని సత్యమైన వాదన ఇతరుల అసత్యం ముందు బలహీన పడిపోవచ్చు.

ప్రజలకు అతను అజ్ఞానుడని, ఎటువంటి నైపుణ్యాలు లేనివాడని, విద్యలేని వాడని తెలిసినప్పుడు - అతను ఎలా ధర్మప్రచారాన్ని కొనసాగించగలడు? తన చుట్టుప్రక్కల వారికి ఎలా లాభం చేకూర్చగలడు? ఏవిధంగా సమాజంలోని చెడును మంచితో తొలగించే మహోన్నత ప్రయత్నం చేయగలడు? ఏ విధంగా అతను ప్రజలపై ప్రభావం చూపే స్థాయికి చేరుకోగలడు? సమాజంలో కనీస స్థాయి గౌరవస్థానాన్నైనా సరే ఎలా పొందగలడు?

మతిమరుపు ఉన్నవానికి, వస్తువులను పోగొట్టుకునే వానికి ఏదైనా వస్తువును ఇవ్వటంలో ప్రజలు వెనకాడతారనే విషయం అందరికీ తెలిసినదే. కాబట్టి ధర్మప్రచారకుడు తనలోని తెలివితేటల్ని, నైపుణ్యాన్ని సానపెట్టే విద్యలను, ఇస్లామీయ ధర్మవిద్యలను అభ్యసించవలెను. మీ కోసం అటువంటి కొన్ని విద్యలు ఇక్కడ ఇవ్వబడినవి.

1) ఉలూమ్ షరిఅహ్ మరియు సఖాఫత్ – అంటే ఖుర్ఆన్ యొక్క వివరణ, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క సున్నహ్, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క జీవిత చరిత్ర (సీరత్), తౌహీద్, ఫిఖ్ హ్ మొదలైనవి.

2) చరిత్ర, నాగరిత
3) భాష మరియు వాక్చాతుర్యం – దీనిలో సత్యం పలికే, చెడు పలుకుల నుండి నాలుకను కాపాడుకునే విషయాలను సరిగ్గా మరియు ఉత్తమంగా ఆచరించే విధానం, స్వప్నాలను వివరించే విద్యలు.

4) మానవ విద్యలు – మానసిక శాస్త్రం, సామాజిక శాస్త్రం, సద్గుణాల శాస్త్రం, భౌగోళిక శాస్త్రం మొదలైనవి.

5) మేదడుకు మేత – వివిధ విద్యలలోని లోతుపాతుల్ని తెలుసుకోవటం, సరిగ్గా అంచనా వేయగలగటం...

6) ప్రాపంచిక ప్రస్తుత సమస్యల అవగాహన – ప్రస్తుత ప్రాపంచిక సమస్యలకు ఇస్లామీయ త్రాసుపై తూచటం మరియు వాటికి పరిష్కారాన్ని కనుగొనటం, ఇతర సిద్ధాంతాలు సూచించిన పరిష్కారాలను పరిశీలించటం, సరైన ఆధారాలతో సమాధానమివ్వటం మొదలైనవి.

# ఖుత్బ-ఎ-జుమ’హ్
# (జుమహ్ ప్రసంగం)

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్

## జుమ'హ్ ఖుత్బహ్ (జుమహ్ ప్రసంగం)

జుమహ్ ప్రసంగం ఇస్లామీయ జీవితానికి ఊపిరి వంటిది. దీని ద్వారా ప్రతివారం విశ్వాసంలో ఉత్తేజం, నూతన శక్తి, వృద్ధి జనిస్తాయి. అనేక బలహీనతలు చోటు చేసుకున్న నేటి సమాజంలోని ముస్లింలు, జుమహ్ ఖుత్బాల ఈ శుభాలకు కూడా దూరమయ్యారు. దాని ఫలితంగా జుమహ్ ప్రసంగం కేవలం ఒక ఆచారంగా మాత్రమే మిగిలి పోయింది.

ఇలాంటి స్థితికి ఒక కారణం – జుమ'హ్ ప్రసంగాలలో వాడే అరబీ భాష ముస్లిలందరికీ తెలియక పోవడం. అందువలన అనేక చోట్ల అరబీ భాషతో పాటు స్థానిక ప్రజల మాతృభాషలో కూడా జుమ'హ్ ప్రసంగం చేయడం జరుగుతున్నది.

ఈ ప్రసంగాలు జుమ'హ్ ఖుత్బహ్ లో వినిపింపగోరేవారు ప్రతి ప్రసంగానికి ముందు "ఖుత్బహ్ యే మస్నూన్" (ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సాంప్రదాయ పద్ధతిలోని ఖుత్బహ్ వచనాలు) అంటే మొదటి ప్రసంగం పఠించాలి. ఆ తర్వాత "ఖుత్బహ్ యే థానియా" (ద్వితీయ ప్రసంగం)లో తమకు నచ్చినది పఠించవచ్చు. అయితే, ఈ రెండు ప్రసంగాలు తప్పని సరిగా అరబీ భాషలోనే ఉండాలి.

మన రాష్ట్రంలోని కొన్ని గ్రామాలలో, పల్లెలలో ఖతీబ్ (ఖుత్బహ్ ప్రసంగం ఇచ్చేవారు) లేకపోవటం వలన లేదా ఏదో కారణం వలన ఖతీబ్ రాలేక పోయినందు వలన అచ్చటి ముస్లింలు చాలా కష్టాలు పడవలసి వస్తున్నది. అందు మూలంగా, అటువంటి పరిస్థితులలో ఇస్లామీయ పరిజ్ఞానం కలిగి, అరబీ భాష తెలియక పోయినా జుమ'హ్ ప్రసంగం ఇవ్వడానికి సహాయపడే విధంగా ఈ క్రింది విషయాలు సమకూర్చాను.

1. ఖతీబ్ (ఖుత్బహ్ ప్రసంగం ఇచ్చేవారు) మెంబరు పై ఎక్కిన వెంటనే "అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వ బరకాతహు[1]" అంటూ ప్రజలకు ఇస్లామీయ అభివందనం అంటే సలాం చేసి మెంబరుపై కూర్చోవాలి. తర్వాత అదాన్ పలుకులు ఇవ్వబడును.

2. ఆ తర్వాత ఖతీబ్ ప్రజలకు అభిముఖంగా మెంబరుపై నిలబడి, "ఖుత్బహ్ యే మస్నూన్" అరబీ భాషలో పఠించాలి.

3. ఖుత్బహ్ యే మస్నూన్ పఠించిన తర్వాత ఏ అంశం గురించి ప్రసంగం ఇవ్వదలుచుకున్నారో, ఆ ప్రసంగానికి సంబంధించిన ఖుర్ఆన్ ఆయతులు మరియు హదీథులు పఠించడం ఉత్తమం.

4. ఆ తర్వాత వారు తమ ప్రాంతీయ భాష (తెలుగు, ఉర్దూ, హిందీ ....మొ.) లో ప్రసంగం ఇవ్వాలి. శ్రోతలలో అల్లాహ్ పట్ల భయభక్తులు పెరగటానికి, వారి విశ్వాసం వృద్ధి చెందేటట్లు, అల్లాహ్ మరియు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల ప్రేమ, విధేయత కలగటానికి, తమ బలహీనతలను గుర్తించి వాటిని దూరం చేసుకోవటానికి, సమాజంలో ప్రబలి పోతున్న చెడు

---

. అనువాదం – అల్లాహ్ యొక్క దీవెనలు, కరుణ మరియు శుభాలు మీపై కురుయుగాక[1]

5. గురించి వివరించి దాని కారణంగా మనం ఇహపరలోకాలలో ఎలా నష్టపోతున్నామో గ్రహించటానికి దోహద పడేటట్లుగా ప్రసంగం ఉండాలి. ఇలాంటి ప్రసంగం శ్రోతలకు లాభదాయకమవుతుంది... ఇన్ షా అల్లాహ్. ***ఇక్కడితో మొదటి ప్రసంగం పూర్తవుతుంది.***

6. మొదటి ప్రసంగం పూర్తయిన తర్వాత ఖతీబ్ మెంబరుపై కొద్ది క్షణాల పాటు కూర్చోవాలి. ఈ విరామ సమయంలో ప్రజలు దుఆ చేయడం ఉత్తమం. ఎందుకంటే, దుఆ స్వీకరించబడే ఉత్తమ సమయాలలో ఇది కూడా ఒకటని హదీథులో చెప్పబడింది.

7. ఆ తర్వాత ఖతీబ్ లేచి నిలబడి, మొదటి ఖుత్బహ్ లో లాగ అరబీ భాషలో ఖుత్బహ్ యే థాని (రెండవ ఖుత్బహ్) పఠించాలి. ఆ తర్వాత క్లుప్తంగా తమ ప్రాంతీయ భాషలో పైన పేర్కొన్న అంశం యొక్క ప్రయోజనాలు మరియు లాభాలు సారాంశ రూపంలో టూకీగా చెప్పడం మంచిది. దీని వలన ప్రజలు ఖుత్బహ్ లో పేర్కొనబడిన విషయాలను సులభంగా గుర్తుంచుకునే అవకాశం ఉన్నది.

8. రెండవ ఖుత్బహ్ (ఖుత్బహ్ యే థాని) మరియు ప్రాంతీయ భాషలోని దాని వివరణ ప్రసంగం ముగించిన తర్వాత మెంబరుపై నిలబడే యావత్తు ముస్లింల కొరకు దుఆ చేయాలి.

| | | |
|---|---|---|
| అల్లాహ్ యొక్క శాంతి, కరుణ మరియు శుభాలు మీ అందరిపై కలుగు గాక! | అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వ బరకాతుహు | اَلسَّلامُ عَلَيْكُمْ وَ رَحْمَةُ اللهِ وَ بَرَكَاتُهُ |
| సకల స్తోత్రాలూ నిశ్చయంగా అల్లాహ్ కే చెల్లుతాయి, | ఇన్నల్ హమ్ ద లిల్లాహ్ | اِنَّ الْحَمْدَ لِلَّهِ، |
| మేము ఆయననే స్తుతిస్తాము, | నహ్ మదుహు | نَحْمَدُهُ، |

| | | |
|---|---|---|
| మరియు సహాయం కొరకు (కేవలం) ఆయననే అర్థిస్తాము, | వ నస్తఈనుహు | وَنَسْتَعِيْنُهُ، |
| మరియు క్షమించమని (కేవలం) ఆయననే వేడుకుంటాము, | వ నస్తగ్ ఫిరుహు | وَنَسْتَغْفِرُهُ، |
| మరియు మేము ఆయననే విశ్వసిస్తాం, | వ ను'మిను బిహీ | وَنُؤْمِنُ بِهِ، |
| మరియు మేము ఆయనపైనే ఆధారపడి వున్నాం | వ నతవక్కలు అలైహ్ | وَنَتَوَكَّلُ عَلَيْهِ، |
| మరియు మా మనసుల దుష్టత్వాల నుంచి | వ నఊదు బిల్లాహి మిన్ షురూరి అన్ ఫుసినా | وَنَعُوْذُ بِاللهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا، |
| మరియు మా ఆచరణలలోని చెడుల నుంచి అల్లాహ్ శరణు | వ సయ్యి ఆతి ఆమాలినా | وَمن سَيِّئَاتِ اَعْمالِنَا، |

| | | |
|---|---|---|
| వేడుకుంటున్నాం. | | |
| మరియు ఎవరికైతే అల్లాహ్ సన్మార్గం చూపించినాడో, అతనిని ఎవ్వరూ దారి తప్పించలేరు, | మన్ య్యహ్ దిహిల్లాహు ఫలా ముదిల్లలహ్ | مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلا مُضِلَّ لَهُ، |
| మరియు ఎవరినైతే ఆయన దారి తప్పించినాడో, అతనికి ఎవ్వరూ సన్మార్గం చూపించలేరు, | వ మన్ య్యుద్ లిల్ ఫలా హాదియలహ్ | وَ مَنْ يُّضْلِلْ فَلاهادِيَ لَهُ، |
| మరియు అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు ఎవ్వడూ లేడని, | వ అష్హదు అన్ లా ఇలాహ ఇల్లల్లాహు | وَاَشْهَدُ اَنْ لااِلٰهَ اِلاَّاللّٰهُ |
| ఆయన ఒక్కడేనని, ఆయనకు భాగస్వాము లెవరూ లేరని మేము | వహ్దహు లా షరీక లహు | وَحْدَهُ لا شَرِيْكَ لَهُ، |

| | | |
|---|---|---|
| సాక్ష్యమిస్తున్నాం, | | |
| మరియు ముహమ్మద్, ఆయన దాసుడు | వ అష్ హదు అన్న ముహమ్మదన్ అబ్దుహు వ రసూలుహు | واَشْهَدُ اَنَّ مُحَمَّداً عَبْدُهُ |
| ఆయన సందేశపరుడు (ప్రవక్త) అని కూడా మేము సాక్ష్యమిస్తున్నాం. | | وَ رَسُوْلُهُ، |
| ఆ తరువాత | అమ్మా బా'ద్ | اَمَّا بَعَدُ. |
| అన్నింటికన్న శుభప్రదమైన వాక్కు నిశ్చయంగా అల్లాహ్ గ్రంథమే. | ఫ ఇన్న ఖైరల్ హదీథి కితాబుల్లాహ్ | فَاِنَّ خَيْرَ الْحَدِيْثِ كِتَابُ اللهِ، |
| మార్గాలన్నిటిలోనికీ శుభమైనది ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క మార్గమే. | వ ఖైరల్ హద్యి - హద్యు ముహమ్మదిన్ సల్లల్లాహు అలైహి వసల్లం | وَخَيْرَ الْهَدْيِ هَدْيُ مُحَمَّدٍ صَلَّى اللهُ عَلَيْهِ وَ سَلَّمَ، |
| పనులన్నింటిలో కెల్లా చెడ్డ పనులు- ధర్మంలో | వ షర్రల్ ఉమూరి | وَ شَرَّ الأُمُوْرِ مُحْدَثَاتُهَا، |

| | | |
|---|---|---|
| లేని వాటిని కొత్తగా సృష్టించడమే. | ముహ్దథాతుహా | |
| అలా సృష్టించబడినవన్నీ కల్పితాలే ('బిద్‌అత్' లే) | వ కుల్లు ముహ్ దథతిన్ బిదఅ'హ్ | وَ كُلُّ مُحْدَثَتٍ بِدْعَةٌ، |
| ధర్మంలో లేని ప్రతి కల్పిత విషయమూ, నూతన పోకడా మార్గభ్రష్టత్వమే. | వ కుల్లు బిద్‌అ'తిన్ దలాలహ్ | وَ كُلُّ بِدْعَةٍ ضَلاَ لَةٌ، |
| మరియు ప్రతి మార్గభష్టత్వమూ నరకాగ్ని లోకి చేరుతుంది. | వ కుల్లు దలాలతిన్ ఫిన్నార్. | وَ كُلُّ ضَلاَلَةٍ فِيْ النَّارِ. |
| అల్లాహుతఆలా ఖుర్‌ఆన్ మజీదులో ఇలా అన్నాడు. | ఖాలల్లాహు తఆ'లా ఫిల్ ఖుర్‌ఆనిల్ మజీద్ | قَالَ اللهُ تَعَالَى فِيْ الْقُرْآنِ الْمَجِيْد |
| మరియు బహిష్కరింపబడిన షైతాన్ బారి నుంచి నేను అల్లాహ్ శరణు వేడుకుంటున్నాను. | ఫ అఊదు బిల్లాహి మినష్షైతానిర్రజీమ్ | فَاَعُوْذُ بِاللهِ مِنَ الشَّيْطَانِ الرَّجِيْمِ |
| ఓ ప్రజలారా! ఒకే ఆత్మనుండి మిమ్మల్నందరినీ సృష్టించిన – మీ | యా అయ్యుహన్నాసుత్తఖూ రబ్బకుముల్లదీ ఖలఖకుమ్ మిన్నఫ్ సిన్ | يَا أَيُّهَا النَّاسُ اتَّقُوا رَبَّكُمُ . الَّذِي خَلَقَكُم مِّن نَّفْسٍ وَاحِدَةٍ |

| | | |
|---|---|---|
| ప్రభువుకు భయపడండి. | వాహిదహ్. | |
| దాని నుండే ఆయన దాని జతను సృష్టించినాడు | వ ఖలఖ మిన్ హా జవ్ జహ్. | وَخَلَقَ مِنْهَا زَوْجَهَا |
| ఆ ఇద్దరి నుండి అనేక మంది పురుషులను మరియు స్త్రీలను విస్తరింపజేసినాడు | వ బథ్థ మిన్ హుమా రిజాలన్ కథీరన్ వ్వనిసాఅ. | وَبَثَّ مِنْهُمَا رِجَالًا كَثِيرًا وَنِسَاءً |
| ఎవరి పేరున అయితే మీరు హక్కుల కోసం పరస్పరం అడుగుతారో - ఆ అల్లాహ్ కు భయపడండి; అలాగే రక్తసంబంధాలను త్రెంచడం నుండి కూడా భయపడండి. | వత్తఖుల్లాహల్లదీ తసాఅలూన బిహి వల్ అర్ హామ్. | وَاتَّقُوا اللَّهَ الَّذِي تَسَاءَلُونَ بِهِ وَالْأَرْحَام |
| నిశ్చయంగా, అల్లాహ్ మిమ్మల్ని అన్నివేళలా గమనిస్తూనే ఉన్నాడు. (సూరతున్నిసా 4:1) | ఇన్నల్లాహ కాన అలైకుమ్ రఖీబా. | اِنَّ اللّٰهَ كَانَ عَلَيْكُمْ رَقِيبًا {سورة النساء 4:1 } |
| | | |
| ఓ విశ్వాసులారా ! అల్లాహ్ కుభయపడండి – ఆయనకు ఎంతగా భయపడ వలసిన | యా అయ్యుహల్లదీన ఆమనుత్తఖుల్లాహ హఖ్ఖ తుఖాతిహి. | يَا أَيُّهَا الَّذِينَ آمَنُوْا اتَّقُوا اللَّهَ حَقَّ تُقَاتِهِ |

| | | |
|---|---|---|
| హక్కు మీపై ఉన్నదో అంతగా భయపడండి | | |
| మరియు మీరు ముస్లింలుగా తప్ప చనిపోకండి. (సూరహ్ ఆలె ఇమ్రాన్ 3:102) | వలా తమూతున్న ఇల్లా వ అన్‌తుమ్ ముస్లిమూన్ - 3:102 | وَلا تَمُوتُنَّ إِلا وَأَنتُم مُّسْلِمُونَ سورة آلعمران |
| | | |
| ఓ విశ్వాసులారా! అల్లాహ్ కు భయపడండి. | యా అయ్యుహల్లదీన ఆమనుత్తఖుల్లాహ, | يَا أَيُّهَا الَّذِينَ آمَنُوْا اتَّقُوا اللَّهَ |
| మరియు సత్యాన్నే పలకండి. | వ ఖూలూ ఖవ్ లన్ సదీదా. | وَقُولُوا قَوْلاً سَدِيدًا |
| అల్లాహ్ మీ కర్మలను చక్కదిద్దుతాడు | యుస్‌లిహ్ లకుమ్ ఆ'మాలకుమ్. | يُصْلِحْ لَكُمْ أَعْمَالَكُمْ |
| మీ తప్పులను మన్నిస్తాడు (మిమ్మల్ని క్షమిస్తాడు). | వ యగ్‌ఫిర్ లకుమ్ దునూబకుమ్ | وَيَغْفِرْلَكُمْ ذُنُوْبَكُمْ |
| ఎవరైతే అల్లాహ్ కు, ఆయన ప్రవక్తకూ విధేయత చూపినాడో గొప్పసాఫల్యం పొందినాడు). (సూరతుల్ | వ మన్‌య్యుతిఇ'ల్లాహ వ రసూలుహు ఫఖద్ ఫాజ ఫవ్‌జన్ అజీమా | وَمَنْ يُّطِعِ اللَّهَ وَرَسُولَهُ فَقَدْ فَازَ فَوْزًا عَظِيمًا (سورة الأحزاب **33:70** |

| | | |
|---|---|---|
| అహ్ జాబ్ 33:70) | | ( |
| ***మొదటి ఖుత్బాలో ఏమి చెప్పదలచుకున్నారో అది చెప్పాలి.*** | | |
| ఈ గొప్ప ఖుర్ఆన్ వల్ల నాకూ మరియు మీకు అల్లాహ్ శుభాలు కలుగజేయు గాక | బారకల్లాహు లీ వ లకుమ్ ఫిల్ ఖుర్ఆనిల్ అజీమ్ | بَارَكَ اللهُ لِيْ وَلَكُمْ فِيْ الْقُرْآنِ الْعَظِيْمِ، |
| మరియు ఇందులోగల ఆయతులు మరియు వివేకవంతమైన స్మృతులలో అల్లాహ్ నాకూ మరియు మీకూ లాభం చేకూర్చుగాక | వ నఫ'నిల్లాహు వ ఇయ్యాకుమ్ బిమా ఫీహి మినల్ ఆయాతి వజ్జిక్రిల్ హకీమ్ | وَنَفَعْنِيْ اللهُ وَإِيَّاكُمْ بِمَا فِيْهِ مِنَ الآيَاتِ وَالذِّكْرِ الْحَكِيْمِ. |
| *ఏదైతే మీరు వింటున్నారో, దానిని పలకండి.* | *అఖూలు మా తస్మఊన్* | أَقُوْلُ مَا تَسْمَعُوْنَ، |
| నా కొరకు మీకొరకు మరియు సమస్త విధేయుల(ముస్లింల) కొరకు సర్వ పాపముల నుండి అల్లాహ్ యొక్క క్షమాపణ కోరండి | వస్తగ్ ఫిరుల్లాహ లీ వ లకుమ్ వ లి జమీఇల్ ముస్లిమీన మిన్ కుల్లి దన్ బ్ | وَأَسْتَغْفِرُاللهَ لِيْ وَلَكُمْ وَلِجَمِيْعِ الْمُسْلِمِيْنَ مِنْ كُلِّ ذَنْبٍ، |
| మరి ఆయనతో క్షమాభిక్ష కోరండి నిస్సందేహంగా ఆయన అందరి కన్నా ఎక్కువగా క్షమించువాడూ, కరుణించువాడూనూ | ఫస్తగ్ ఫిరూహు ఇన్నహు హువల్ గఫూరుర్రహీమ్. | فَاسْتَغْفِرُوْهُ إِنَّهُ هُوَ الْغَفُوْرُ الرَّحِيْمُ. |

## తర్వాత ఖతీబ్ మెంబరుపై కొద్ది క్షణాల పాటు కూర్చోవాలి.

## రెండవ ఖుత్బహ్ ( రెండవ ప్రసంగం) – ఖుత్బహ్ అథ్ థాని

الحمد لله رب العلمين و الصلاة والسلام على رسول الله و على آله و اصحابه اجمعين ، اما بعد:

అల్ హమ్ దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్. వస్సలాతు వస్సలాము అలా రసూలుల్లాహి సల్లల్లాహు అలైహి వసల్లం వ ఆలా ఆలిహి వ అస్హాబిహీ అజ్మయీన్.

(ఆ తర్వాత ఖుర్ఆన్ ఆయతు లేదా హదీథులు పఠించవచ్చు. రెండవ ఖుత్బహ్ లో ఏమి చెప్పదలుచుకున్నారో, దానిని ప్రాంతీయ భాషలో చెప్పాలి) (దాని తర్వాత ఖుత్బహ్ ముగించే ముందు ఈ క్రింద తెలిపిన విధంగా చెప్పండి)

| | | |
|---|---|---|
| నిశ్చయంగా అల్లాహ్ మరియు ఆయన దైవదూతలు దైవప్రవక్తపై దరూద్ పంపుతారు. ఓ విశ్వాసులారా! మీరు కూడా ఆయనపై దరూద్ మరియు సలాములు పంపండి. | ఇన్నల్లాహ వ మలాఇకతహు యుసల్లూన అలన్నబియ్యి యా అయ్యుహల్లదీన ఆమనూ సల్లూ అలైహి వసల్లిమూ తస్లీమ 33:56. | إِنَّ اللَّهَ وَمَلَائِكَتَهُ يُصَلُّونَ عَلَى النَّبِيِّ يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا صَلُّوا عَلَيْهِ وَسَلِّمُوا تَسْلِيمً |
| ***(ఆ తర్వాత ముస్లిములందరి క్షేమము, సుఖసంతోషాల కొరకు, ఐక్యత కొరకు, క్షమాపణ కొరకు ఇలా దుఆ చేయాలి.)*** | | |
| ఓ అల్లాహ్! ఎవరైతే ధర్మం యొక్క సహాయం చేస్తారో, నీవు వారి సహాయం చేయి. మమ్ముల్నీ వారితో | "అల్లాహుమ్మన్ సుర్ మన్నస్ రద్దీన ముహమ్మదిన్ సల్లల్లాహు అలైహి వసల్లం – వజ్అల్ నా | اللهم النصر من نصر الدينَ محمد صلى الله عليه و سلم – وجعلنا |

| | | |
|---|---|---|
| చేర్చు.<br>ఎవరైతే ధర్మాన్ని కూలదోస్తారో, వారిని నీవు కూలదోయి. మమ్ముల్ని వారితో చేర్చకు. | మిన్ హుమ్. వఖ్ దుల్ మన్ ఖజ్ లద్దీన ముహమ్మదిన్ సల్లల్లాహు అలైహి వసల్లం – వలా తజ్అల్ నా మిన్ హుమ్.” | منهم. واخذُل من خذل الدينَ محمد صلى الله عليه و سلم – ولا تجْعلنا منهم. |
| ఓ అల్లాహ్ !<br>ముస్లింలలోని రోగులకు స్వస్థత చేకూర్చు. మరియు అప్పులలో ఉన్నవారి అప్పులు తీర్చు. | “అల్లాహుమ్మష్ ఫీ మర్ జల్ ముస్లిమీన. వఖ్ ది ఖర్ జల్ మదీనీన్. | اللهم اشْفي مرْضى المسْلمين و اقْض قرْض المدي نين |
| ఓ అల్లాహ్ ! మరణించిన ముస్లింలను మన్నించు. | అల్లాహుమ్మగ్ ఫిర్ మవ్ తల్ ముస్లిమీన్. | اللهم اغْفر مَوْت المسْلمين |
| ఓ అల్లాహ్ ! మాలోని బలహీనులపై దయ చూపు. మరియు మాలో దుస్తులు లేని వారికి దుస్తులు ప్రసాదించు. | అల్లాహుమ్మర్ హమ్ దలఫాఅనా. వజ్ బుర్ కస్ రనా వక్ సి ఆరినా. | اللهم ارْحم ضعفاءنا واجْبر كسْرنا و اكْس عارنا |
| అల్లాహ్ దాసులారా !<br>అల్లాహ్ మీపై కృప జూపు గాక ! | **ఇబాదల్లాహ్!**<br>**యర్హమకుముల్లాహ్!** | **عباد الله ، يرْحمكم الله** |
| నిశ్చయంగా, న్యాయం చేయండి, ఉపకారం చేయండి, బంధువుల | “ఇన్నల్లాహ య’మురు బిల్ అద్ లి వల్ఇహ్ సాని. వ ఈతాయి దిల్ | إِنَّ اللَّهَ يَأْمُرُ بِالْعَدْلِ وَالْإِحْسَانِ وَإِيتَاءِ ذِي |

| | | |
|---|---|---|
| హక్కులు నెరవేర్చండి అని అల్లాహ్ ఆజ్ఞాపిస్తున్నాడు. చెడును, అశ్లీలతను, అన్యాయాన్ని, మితిమీరి ప్రవర్తించడాన్ని అల్లాహ్ నిషేధించాడు. మీ గుణపాఠం కొరకు ఆయన మీకు హితబోధ చేస్తున్నాడు. | ఖుర్ బా వ యన్ హా అనిల్ ఫహ్ షాఇ.<br>వల్ మున్ కరి వల్ బగ్ యి యఇదుకుమ్ లఅల్లకుమ్ తజక్కరూన్." (16:90) | الْقُرْبَى وَيَنْهَى عَنِ الْفَحْشَاءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُونَ |
| అల్లాహ్ ను స్మరించండి – ఆయన మిమ్మల్ని గుర్తుంచుకుంటాడు.<br>ఆయననే వేడుకోండి – ఆయన మీ మొరలను ఆలకిస్తాడు.<br>మరియు నిశ్చయంగా అల్లాహ్ స్మరణయే మొదటిది, శ్రేష్ఠమైనది మరియు మహోన్నతమైనది. | ఉజ్ కురుల్లాహ యజ్ కురుకుమ్ ఉద్ఊహు యస్తజిబ్ లకుమ్<br>వల జిక్ రుల్లాహి తఆలా ఊలా వఅజూ వ జల్లు వ హమ్మూ వ తమ్మూ వ అక్బర్. | أُذْكروا الله يذْكركم أدْعواه يستجبْلكم و لذكْر الله تعلى أولى و عزو وجلّ و همّوا و تموا و اكْبر |
| **సమాప్తం** | | |
| **గమనిక: అరబీ వాక్యాలను ఉన్నవి ఉన్నట్లుగా తెలుగులో వ్రాయడం అసాధ్యం. కాబట్టి వీలైనంత త్వరగా అరబీభాష నేర్చుకోండి.** | | |

**వ లిల్లాహిల్ హమ్ద్ అవ్వలన్ వ ఆఖిరన్**

**సర్వస్తుతులన్నీ ఎల్లప్పుడూ అల్లాహ్'కే చెందుతాయి**